తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ | జనగాం | ములుగు | నిర్మల్ | మంచిర్యాల | ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి | కొమురం భీం ఆసిఫాబాద్ | మహబూబాబాద్

శనివారం 5 సెప్టెంబర్ 2026 | పేజీలు - 12

# బీఆర్ఎస్ జీవో 76తో పట్టాలిస్తే 22ఎతో నిషేధిత జాబితా చేర్చిన కాంగ్రెస్

- **కబ్జా కోర్ ప్రభుత్వంగా మారిన కాంగ్రెస్**
- **మాజీ మంత్రి హరీష్ రావు**



**మంచిర్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మంచిర్యాల జిల్లాలో జీవో 76 తీసుకొచ్చి పట్టాలు పంపిణీ చేస్తే రేవంత్ రెడ్డి సర్కార్ 22 ఏ జీవో తీసుకువచ్చి ఆ పట్ట భూములను నిషేధిత జాబితాలో చేర్చి కాంగ్రెస్ ప్రభుత్వం కబ్జాకోరుగా మారిందని మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. 22 ఏ జీవో తీసుకువచ్చి రాష్ట్రవ్యాప్తంగా 14 లక్షల 50 వేల ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో చేర్చి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను ఇబ్బందులకు నెట్టారని తెలిపారు.మొన్నటి వరకు లక్షలాది రూపాయల విలువైన భూమిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఒక్క కలంపోటుతో లక్షలాది రూపాయల ఆస్తులను జీరో వ్యాల్యూ చేసే విధంగా జీవోలు తీసుకువచ్చారని తెలిపారు .పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాకు తెలియకుండానే అధికారులు చేశారని చెప్పడం ఆశ్చర్యంగా ఉందని విమర్శించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే జిల్లా కలెక్టర్లు జిల్లాలో ఉన్న నిషేధిత జాబితా భూముల వివరాలను పంపాలని పేర్కొన్నారు .ఒక మంచిర్యాల జిల్లాలోని నాన్ అగ్రికల్చర్ భూములు 5525 ఎకరాలు ఉందని వీరి పరిస్థితి ఏంటి అని విమర్శించారు. మంచిర్యాల జిల్లాలో పదివేల ఇండ్లు 22ఏలోకి వస్తున్నాయని వీరందరూ రేపు అవసరం పడి తమ ఆస్తులు అమ్ముకుందామంటే ఎవరు కొనుగోలు చేసే పరిస్థితి లేదని తెలిపారు. ఇలాంటి పనులు గతంలో ఉన్న ఏ ముఖ్యమంత్రి కూడా చేయలేదని రేవంత్ రెడ్డి మాత్రం చేసి ప్రజలకు వ్యతిరేకంగా మారడని తెలిపారు .ఒక గర్మిల శివారులోని సర్వేనెంబర్ 83లో 123 ఎకరాలు నిషేధిత జాబితాలో చేర్చడంతో వారి పరిస్థితి ఏమిటని విమర్శించారు .22ఖ లోకి మార్చే ముందు ప్రజలకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఇలాంటి చీకటి జీవోలు తీసుకురావడం ప్రజలను ఇబ్బంది పెట్టడానికి అని విమర్శించారు .ఇంత చేసి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 22 ఏ జీవో పై సారీ చెప్పడం వల్ల ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని ప్రజల సమస్యలు పరిష్కారం చేసే దిశగా ప్రయత్నం చేయాలని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించకుండా ప్రజల అవసరాలను గుర్తించకుండా ప్రజలు ఎన్నో ఏళ్లు కష్టపడి డబ్బులు పోగుచేసుకొని కొనుగోలు చేసిన ఆస్తులను జీరో చేయడం ఇది ప్రభుత్వ దుర్మార్గానికి పరాకాష్ట అని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని తుగ్లక్ ముఖ్యమంత్రిగా అభివర్ణించారు .ప్రజలు ఎవరు దరఖాస్తులు పెట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్ రెడ్డి 22 ఏ సవరించాలని డిమాండ్ చేశారు. సీఎం భూములను ఎలాగైతే 22ఖ జాబితాలో నుండి తీసివేశారో అలాగే జీవోను సవరించి ప్రజల భూములను ఆస్తులను నిషేధిత జాబితా నుండి బేషరతుగా తొలగించాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు .సుమన్ మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు విజిత్ రావు టిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు

# బ్రీడింగ్ చెక్కర్స్‌ను విధుల్లోకి తీసుకోరూ!

- **నెల రోజులు గడుస్తున్నా పట్టించుకోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు...**
- **గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పై కానరాని ఇంటింటి సర్వే**
- **నిలిచిపోయిన మలేరియా, డెంగ్యూ విష జ్వరాలు ప్రబలకుండా నిర్వహించాల్సిన స్ప్రే**
- **ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్**
- **విధుల్లోకి తీసుకోవాలని కోరుతున్న బ్రీడింగ్ చెక్కర్స్**



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 4 ( జనం సాక్షి):** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కొనసాగాల్సిన బ్రీడింగ్ చెక్కర్స్ ను విధుల్లోకి తీసుకోకపోవడంతో గ్రామాలలో సీజనల్ వ్యాధులపై నిర్వహించాల్సిన ఇంటింటి సర్వే, మలేరియా, డెంగ్యూ విష జ్వరాలు ప్రబలకుండా చేపట్టాల్సిన స్ప్రే కానరాకుండా పోయింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు మొదటి వారంలో జిల్లాలోని బ్రీడింగ్ చెక్కర్స్ ను విధుల్లోకి తీసుకోవాలని ఆదేశాలు సైతం జారీ చేసింది. కానీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నెల రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు వారిని విధుల్లోకి తీసుకోకుండా ప్రభుత్వ ఆదేశాలను సైతం బేఖాతర్ చేశారు. ఇప్పటికైనా జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులు వెంటనే తమను విధుల్లోకి తీసుకోవాలని బ్రీడింగ్ చెక్కర్స్ వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.... వరంగల్ జిల్లాలో మిగతా 14లో..

# మారుమూల పల్లెలో వెలిగిన డాక్టర్ కల

- **పలిమెల యువకుడు కుమ్మరి వెంకటేష్‌కు ఎంబీబీఎస్ సీటు**
- **పేదరికాన్ని జయించిన వెంకటేష్**



**పలిమెల సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** అత్యంత నిరుపేద కుటుంబం, వసతులు సరిగ్గా లేని మారుమూల గ్రామం.. అయినా సరే, దృఢ సంకల్పం ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించాడు పలిమెల గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటేష్. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి, పట్టుదలతో చదివి మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ(జీఎంసీఎం)లో ఎంబీబీఎస్ సీటు సాధించి తన గ్రామానికి, కుటుంబానికి ఎనలేని గుర్తింపు తీసుకొచ్చాడు. చాలా పేద కుటుంబానికి చెందిన వెంకటేష్, చిన్నప్పటి నుండి చదువులో ఎంతో ప్రతిభ కనబరిచాడు. ఎలాంటి హంగులు, ఆర్భాటాలు లేని పల్లెటూరు వాతావరణం నుండి వచ్చి, వైద్య విద్యలో ప్రవేశం పొందడం సాధారణ విషయమేమీ కాదు. తన కష్టాన్ని, తల్లిదండ్రుల నిరంతర శ్రమను గుర్తించి శ్రమించిన వెంకటేష్, అనుకున్న లక్ష్యాన్ని సాధించి 'డాక్టర్' అయ్యే దిశగా మొదటి అడుగు వేశాడు. వెంకటేష్‌కు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు రావడం పట్ల పలిమెల మండల ప్రజలు, గ్రామస్తులు తీవ్ర ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామం నుండి ఒక సాధారణ యువకుడు డాక్టర్ కాబోతున్నందుకు సంతోషిస్తూ వెంకటేష్‌ను, ఆయన కుటుంబ సభ్యులను అభినందనలు తెలియజేశారు.

ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ "ఎన్నో ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ, మారుమూల గ్రామం నుండి ఎంబిబిఎస్ లాంటి ప్రతిష్టాత్మక సీటు సాధించడం ఎంతో గర్వకారణం. వెంకటేష్ విజయం గ్రామంలోని ఎంతో మంది విద్యార్థులకు, యువతకు ఆదర్శంగా నిలుస్తుంది" అని కొనియాడారు. భవిష్యత్తులో వెంకటేష్ ఉత్తమ వైద్యుడిగా నిలిచి, సమాజానికి, ప్రత్యేకించి తన లాంటి పేద ప్రజలకు సేవ చేయాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. "తండ్రి లేకపోయినా నన్ను అడుగడుగునా ప్రోత్సహించి, ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ చదివించిన నా తల్లి, అక్కల త్యాగమే నన్ను ఈ రోజు డాక్టర్‌ను చేసింది. ఎన్ని కష్టాలొచ్చినా నన్ను వెనక్కి తగ్గనివ్వకుండా, నా చదువుకే తొలి ప్రాధాన్యం ఇచ్చిన వారికి నా జీవితాంతం రుణపడి ఉంటాను" అని మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించిన పలిమెలకు చెందిన కుమ్మరి వెంకటేష్ భావోద్వేగంతో తెలిపారు.

# చదువుల 'గుడి'లో.. 'గురు'వే దైవం

- **విద్యార్థుల భవిష్యత్తుకు బాట వేసే మార్గదర్శి**
- **అక్షరాలతో జీవిత పాఠాలు నేర్పించే సారు**
- **నేడు గురు పూజోత్సవం**




**మావల సెప్టెంబర్ 05(జనం సాక్షి):** ఒక గురువు మారితే – ఒక తరగతి గది మారుతుంది. ఒక తరం మారితే – ఒక సమాజం మారుతుంది. ఒక సమాజం మారితే – ఒక దేశ భవిష్యత్తు మారుతుంది. తల్లిదండ్రులు జన్మనిస్తే.. బడిలో జీవిత పాఠాలు నేర్పించి పిల్లల భవిష్యత్తుకు బాటలు వేసేది 'గురు'వే.. విద్యాబుద్ధులు నేర్పించి మార్గనిర్దేశం చేస్తూ వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దడంలో శాయశక్తులా శ్రమిస్తారు.. క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యత, ఆత్మవిశ్వాసం వంటి నేర్పిస్తూ సమాజంలో గుర్తింపు తీసుకురావడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం.. తల్లిదండ్రుల తర్వాత అత్యంత పూజనీయంగా భావించేది గురువులనే. 'ఆచార్యదేవోభవ' అంటూ విద్యాబుద్ధులు నేర్పిన గురువులను కీర్తిస్తాం. అధిక సమయం బడిలో గడిపే విద్యార్థుల తెలివితేటలు, ఆలోచనలు, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేది వారే. చదువు మీద శ్రద్ధ తగ్గినట్టనిపించినా.. మనసు పక్కదారి పట్టినట్టు గుర్తించినా దండిస్తారు. సరైన దారిలో నడిపిస్తారు.

విద్యార్థిని క్రమశిక్షణలో నడిపించడం, సన్మార్గం వైపు దారితీయడం, ఎంచుకున్న గమ్యం చేరుకునేలా ప్రోత్సహించడం ఇవన్నీ గురువు భూమికలో భాగం. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే తీరును నేర్పుతూ, ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు కావాల్సిన పునాది వేయడంలో ఉపాధ్యాయుల పాత్ర అపారమైనది. అందుకే గురువులను దైవంతో సమానంగా భావిస్తారు. ప్రతి విద్యార్థిలోనూ దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, చెడు అలవాట్లను దూరం చేసి, జ్ఞానాన్ని బాటలుగా పరిచయం చేసే వాడు గురువు. సమాజపు మార్పులు వేగంగా జరుగుతున్నప్పటికీ విద్యార్థి అభ్యున్నతే తన ధ్యేయంగాముందుకు సాగుతున్నారు. పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దడమే కాదు, పోటీతత్వ ప్రపంచానికి తగిన సాంకేతిక నైపుణ్యం, నైతిక విలువలతో కూడిన విద్యను అందిస్తూ భావి పౌరులను తీర్చిదిద్దే కర్తవ్యాన్ని వారు మిగతా 14లో..

# సర్పంచులు మహిళలే... పెత్తనం మాత్రం భర్తలదే

## మహిళలను వంటింటికే పరిమితం చేస్తున్న వైనం - పాలనా వ్యవహారాల్లో భర్తల జోక్యం




**కెరమెరి, సెప్టెంబర్ 4 (జనంసాక్షి)** మహిళా సాధికారత, మహిళా రిజర్వేషన్ల లక్ష్యం నీరుగారుతుందా? అంటే అవుననే సమాధానం వస్తోంది కెరమెరి మండలంలోని కొన్ని గ్రామపంచాయతీల పరిస్థితి చూస్తే మండలంలోని కొన్ని గ్రామపంచాయతీల్లో మహిళా సర్పంచులు నామమాత్రమే. ఎన్నికల్లో గెలిచింది భార్య అయితే, పాలన చేస్తున్నది మాత్రం భర్తలే. అధికారికంగా సర్పంచ్ మహిళ అయినా, క్షేత్రస్థాయిలో, అధికారుల ముందు, గ్రామసభల్లో చలామణి అవుతున్నది మాత్రం వారి భర్తలేనని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**వంటింటికే పరిమితం:**

ఎన్నికల సమయంలో ముందుండే మహిళా సర్పంచులు, గెలిచిన తర్వాత మాత్రం వంటింటికే పరిమితం అవుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లడం, ఎంపీడీవో, ఎంపీఓ లను కలవడం, చెక్కులపై సంతకాలు చేయడం మొదలు.. అభివృద్ధి పనుల బిల్లుల వరకు అన్నీ భర్తలే చూసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలు ఓటు వేసింది మహిళా సర్పంచ్ కు, కానీ పాలన చేస్తున్నది ఆమె భర్త. దీంతో ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ల ఉద్దేశం దెబ్బతింటోందని, మహిళా సాధికారత అపహాస్యం అవుతోందని మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**గమనిక:**

మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఇదే పరిస్థితి లేకున్నా, కొన్ని గ్రామపంచాయతీల్లో మాత్రమే ఈ పరిస్థితి ఉంది. కొందరు మహిళా సర్పంచులు స్వయంగా తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నారు. అయితే ఇలా భర్తల పెత్తనం నడుస్తున్న చోట్ల వాస్తవాలు తేల్చి, మహిళా సర్పంచులే స్వయంగా పాలన చేసేలా చూడాలని, అధికారులు సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# కామగిరిలో విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి



**బజార్హత్నూర్/ఇచ్చోడ ఆగస్టు 04( జనం సాక్షి):-** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల పరిధిలోని కామగిరి గ్రామానికి చెందిన ఫడ్ భగవత్ అనే రైతు యొక్క గేదె మేత కోసమని గ్రామానికి దగ్గరలో గడ్డి మేస్తుండగా హఠాత్తుగా విద్యుత్ శాఖ వారు రైతులకు కోసం ఏర్పాటు చేసినా టి.ఆర్. దగ్గర ఎర్తింగ్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైరు ప్రమాదవశాత్తు తగిలి ఘటన స్థలంలోనే మృతి చెందడం జరిగింది. ఆ గేదె సుమారు 80 వేల విలువ గలదని ముందే వర్షాలు లేక పంట నష్టంతో అల్లడిల్లుతున్నామని అందులో మళ్ళీ ఇలా జరగడం. రైతు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాడు.ప్రభుత్వ ఉన్నతాధికారులు తనకు ఆర్థిక సహాయం చేయాలని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి పాడి రైతును ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# నేతాజీ పబ్లిక్ స్కూల్‌లో శ్రీ కృష్ణాష్టమి జన్మదిన వేడుకలు



**సారంగాపూర్,సెప్టెంబర్4(జనం సాక్షి)** శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని కౌట్ల బి నేతాజీ పబ్లిక్ స్కూల్లో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, యశోద, గోపికల వేషధారణలో సందడి చేశారు. చిన్నారుల సంప్రదాయ వేషధారణలు, వారి చలాకీతనం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు శ్రీకృష్ణుడి బాల్య లీలలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ముఖ్యంగా శ్రీకృష్ణుడు ఉట్లు కొట్టే కార్యక్రమం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. పాటలు, నృత్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారుల ప్రదర్శనలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆసక్తిగా వీక్షిస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేగుంట గంగాధర్, కిష్టయ్య, ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు.

# పాలకుర్తి సీఐగా 'భరత్ సుమన్'



**పాలకుర్తి, సెప్టెంబరు 03 (జనంసాక్షి)** పాలకుర్తి నూతన సీఐగా భరత్ సుమన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన జానకీరాంరెడ్డి వీఆర్‌కు పంపడంతో ఆ స్థానంలో భరత్ సుమన్‌ను నియమించారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయానికి వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పని చేస్తానని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

# వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే



**నల్లబెల్లి, సెప్టెంబరు 04(జనంసాక్షి):** మండలంలోని నారక్కపేట గ్రామానికి చెందిన మొట్టే సవిత--లక్ష్మణ్ దంపతుల కుమారుడు, బీఆర్ఎస్ గ్రామ పార్టీ యువజన అధ్యక్షుడు మొట్టే గణేష్ వివాహం సంధ్యతో శుక్రవారం నర్సంపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట యాపచెట్టి రాజు తోపాటు తదితరులు ఉన్నారు.

# కాకతీయ బ్రిలియంట్ స్టార్స్‌లో కృష్ణాష్టమి వేడుకలు



**నల్లబెల్లి, సెప్టెంబర్ 04 (జనంసాక్షి):** మండలంలోని రుద్రగూడెం గ్రామ శివారు కాకతీయ బ్రిలియంట్ స్టార్స్ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు వేసిన కృష్ణ, రాధ, గోపికల వేషధారణలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. శ్రీకృష్ణుని విగ్రహానికి పాఠశాల యాజమాన్యం ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలు ప్రారంభించారు. ప్రీ-ప్రైమరీ, ప్రైమరీ విద్యార్థులు కృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, భక్తిగీతాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎం. కమలాకర్‌రావు మాట్లాడుతూ భగవద్గీతలో శ్రీకృష్ణుడు అందించిన బోధనలు నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, సన్మార్గం, ధర్మబద్ధమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అలాగే పాఠశాల డైరెక్టర్లు పొనుగోటి రామారావు, గాదె రాజిరెడ్డి మాట్లాడుతూ చిన్నారుల్లో సాంస్కృతిక, నైతిక విలువలను పెంపొందించడంలో ఇలాంటి పండుగల నిర్వహణ దోహదపడతాయని తెలిపారు. అనంతరం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. విద్యార్థులు పోటీపడి ఉట్టి కొట్టి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ గాదె రణధీర్‌రెడ్డి, బి. శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో కరువు తాండవిస్తోంది



**పాలకుర్తి, సెప్టెంబర్ 03(జనంసాక్షి)** వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనల్లో కరువు తాండవిస్తోందని వరి పంటలను సాగు చేసేందుకు కాల్వలో సాగునీరు పారడం లేదని గురువారం బీఆర్ఎస్ అధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు కెనాల్ బాటపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు పసునూరి నవీన్, నల్ల నాగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అధికారం లోకి వచ్చిన అప్పుడు కరువు కాటకాలతో అల్లాడుతుంటుందని విమర్శించారు. 420 అమలు కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో నాయకులు నాయకులు ఎర్రబెల్లి వినయ్ రావు. మాచెర్ల ఎల్లయ్య, అశోక్ రెడ్డి. వీరమనేని సోమేశ్వర్రావు, సర్పంచులు బానోతు మహేందర్, గడ్డం కిరణ్, పోశాల వెంకన్న, గణపురం సురేష్, పుస్కూరి శ్రీనివాసరావు, కత్తి సైదులు, కలింగరావు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ మహిళా మంత్రి బర్తరఫ్ అన్యాయం

## కొండా సురేఖను తిరిగి మంత్రివర్గంలోకి తీసుకోవాలి



**డోర్నకల్: సెప్టెంబర్ 4 (జనం సాక్షి )** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్: బీసీ మహిళా మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయడం అన్యాయమని డోర్నకల్ బిఆర్ఎస్ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు సాధనాల రాము అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించడం సరికాదని విమర్శించారు. అగ్ర నాయకుల ఆధిపత్య పోరులో బీసీ మహిళా మంత్రిపై చర్యలు తీసుకోవడం అవమానకరమని విమర్శించారు.పార్టీలో అంతర్గతంగా ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించుకోవాలని సూచించారు.కొండా సురేఖ బర్తరఫ్ నిర్ణయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పునరాలోచించి ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే బీసీ నాయకులను గౌరవించే సంప్రదాయాలను కొనసాగించాలని కోరారు. బీసీ మహిళా మంత్రిపై తీసుకున్న చర్యల విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

## నీట్‌లో సత్తా చాటి ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన తుభ తరనుమ్




**ఖానాపూర్ సెప్టెంబర్ 04 (జనం సాక్షి)** పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ తురాబుద్దిన్ రెండవ కుమార్తె తుభా తరనుమ్ వైద్య విద్యారంగంలో మెరుగైన ప్రతిభ కనబరిచారు. ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో 495 మార్కులు సాధించిన ఆమె మొదటి విడత ఎంబిబిఎస్ కౌన్సిలింగ్‌లోనే సీటును కైవసం చేసుకున్నారు. చిన్ననాటి నుండి చదువులో రాణిస్తున్న తుభా తరనుమ్ పదో తరగతి వరకు ఖానాపూర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో అభ్యసించారు. అనంతరం హైదరాబాద్‌లోని ప్రముఖ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. మొదటిసారి రాసిన నీట్ పరీక్ష తొలి ప్రయత్నంలోనే ఎంబిబిఎస్ సీటు సాధించి కుటుంబ సభ్యులకు, పట్టణానికి మంచి పేరు తెచ్చారు. మొదటి ప్రయత్నంలోనే వైద్య సీటు సాధించి డాక్టర్ అయ్యే దిశగా తొలి అడుగు వేసిన తుభా తరనుమ్‌ను పలువురు ప్రముఖులు, జర్నలిస్టులు, స్థానికులు, మిత్రులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా తురాబుద్దిన్ మొదటి కుమార్తె రుబీనా తబస్సుమ్ విఆర్‌కె కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేసి ఉన్నత చదువుల కోసం ప్రవేశ పరీక్షలు రాస్తున్నారు.

## వింధ్య ప్రైవేట్ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**సారంగాపూర్,సెప్టెంబర్4(జనం సాక్షి)** స్థానిక సారంగాపూర్ మండలంలోని వింధ్యా స్కూల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కే.నవీన్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులకు కృష్ణాష్టమి పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు శ్రీ కృష్ణ గోపిక వేషదారణాలతో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆకుల రమేష్ శ్రీ రామ్ శ్రీనివాస్, సాయినాథ్ ,శ్రీనివాస్ గౌడ్, శ్రీలత,పల్లవి,సుమన్య,లావణ్య, సంధ్యారాణి, స్రవంతి,సులోచన, గౌతమి, దివ్య, సౌజన్య, పావని, ప్రేరణ, శరణ్య, లావణ్య, జ్యోతి, కీర్తన, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## బంగారు దుకాణాలు బంద్



**ఖానాపూర్ సెప్టెంబర్ 04 (జనం సాక్షి)** స్వర్ణకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట సత్యనారాయణ మృతికి సంతాప సూచకంగా పట్టణంలో బంగారు దుకాణాలను బంద్ చేశారు. శుక్రవారం తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వర్ణకారులు ఆయన చేసిన సంఘ సేవను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక స్వర్ణకారులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ

**నివాళులర్పించిన వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఈగ సత్యనారాయణ**



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 4( జనం సాక్షి):** మృతుడి కుటుంబాన్ని వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఈగ సత్యనారాయణ పరామర్శించారు. చెన్నారావుపేట గ్రామానికి చెందిన వయోవృద్ధుల సంక్షేమ సంఘం సభ్యులు నల్లాల ప్రతాపరెడ్డి అనారోగ్యంతో మరణించాడు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు ఈగ సత్యనారాయణ ఆధ్వర్యంలో సభ్యులందరూ కలసి అతని మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ములుక సాంబయ్య కవి, వరంగంటి మల్లయ్య, కంది నారాయణరెడ్డి, అడప సత్తయ్య, తోట ఆనందం, గట్ల క్రిష్ణయ్య , సిద్ధ కుమారస్వామి, బిక్షపతి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ దగా పాలనపై బీఆర్ఎస్ నిరసన

- పరకాల అంబేద్కర్ సెంటర్లో వంటావార్పు
- రోడ్డుపైనే మహిళలతో భోజనం చేసిన చల్లా
- హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- మహిళలు, వృద్ధులు, విద్యార్థులకు తీరని అన్యాయం
- చల్లా ధర్మారెడ్డి,మాజీ ఎమ్మెల్యే



**పరకాల,సెప్టెంబర్04,(జనం సాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు.1000 రోజుల కాంగ్రెస్ దగా పాలనకు నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పరకాల అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన వంటావార్పు కార్యక్రమానికి మహిళలు, వృద్ధులు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.రోడ్డుపైనే పొయ్యిలు వెలిగించి వంటలు చేసి మహిళలతో కలిసి మాజీ ఎమ్మెల్యే భోజనం చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కొక్కటిగా ప్రజలకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు.కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాల కింద ఇస్తామన్న తులం బంగారం ఎక్కడుందని ప్రశ్నించారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు అండగా నిలిచిన ఈ పథకాలను నిర్వీర్యం చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పటికీ ఆ హామీని అమలు చేయలేదన్నారు.మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని గొప్పలు చెప్పుకుంటూ.. మరోవైపు పురుషులపై చార్జీల భారం పెంచి కుటుంబాల్లోనే పంచాయతీలు పెట్టే పరిస్థితి తీసుకొచ్చారని చల్లా ధర్మారెడ్డి విమర్శించారు.మహిళల రక్షణకు పటిష్టమైన భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం.. ఆ హామీని కూడా పట్టించుకోవడం లేదన్నారు. మహిళా సంఘాలకు పక్కా భవనాలు నిర్మిస్తామని చెప్పి ఆ హామీని పక్కన పెట్టారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో మహిళా సంఘాలకు నిర్మించిన భవనాలే నేటికీ కనిపిస్తున్నాయని, మహిళా సంఘాల సభ్యులను అడిగితే ఎవరు వారి కోసం పనిచేశారో చెబుతారని అన్నారు.మహిళా కమిషన్‌ను బలోపేతం చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. మహిళల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా కమీషన్ల వసూళ్లకే ప్రాధాన్యత ఇస్తోందని చల్లా ధర్మారెడ్డి ఘాటుగా విమర్శించారు.కేసీఆర్ కిట్‌ను మాయం చేసి గర్భిణీలు, బాలింతలకు అందాల్సిన భరోసాను దూరం చేశారని, మహిళలకు రూ.2,500 ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపించారు. విద్యార్థినులకు ఇస్తామన్న స్కూటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. వృద్ధులకు కేసీఆర్ ప్రభుత్వం అందించిన పెన్షన్లే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేసిందేముందని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, పేదల సంక్షేమాన్ని విస్మరిస్తే ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వానికి గుర్తుచేస్తూ.. ప్రజల పక్షాన బీఆర్ఎస్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని చల్లా ధర్మారెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్లో వైభవంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

- కృష్ణుడు సత్యభామ వేషధారణలో చిన్నారులు
- ఇస్కాన్ టెంపుల్స్‌లో భక్తుల రద్దీ
- శ్రీ భద్రకాళి దేవాలయంలో భక్తుల సందడి



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 4 (జనం సాక్షి)** శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా వరంగల్ నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. శ్రీకృష్ణుని జన్మదినాన్ని పురస్కరించుకొని భక్తులు ఇస్కాన్ టెంపుల్స్ తోపాటు శ్రీ భద్రకాళి దేవాలయం, ఇతర కృష్ణ మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుని, సత్యభామలు గోపికల వేషధారణలతో అందరిని ఆకట్టుకున్నారు. వివిధ వేషధారణలతో ఉన్నటువంటి చిన్నారులను ఆయా గుడులు, గోపురాలకు తీసుకెళ్లి దేవతామూర్తులను దర్శించుకునేలా చేశారు. శ్రీ భద్రకాళి దేవాలయంలో అమ్మవారిని శ్రీకృష్ణుని అలంకరణలో చేయడంతో సాయంత్రం భక్తుల రద్దీ మరింత పెరిగింది. పవిత్ర శ్రావణమాసం శుక్రవారం ఉదయం నుంచి భక్తులు ఆయా దేవాలయాలకు వెళ్లడంతో పండుగ వాతావరణం నెలకొంది.

**ఉట్లు కొట్టే కార్యక్రమం**

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలతో పాటు నగరంలోని పలు ప్రాంతాలలో
ఉట్లుగొట్టే కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పిల్లలు పెద్దలు అనే తేడా లేకుండా పాల్గొన్నారు. ఉట్లు కొట్టే కార్యక్రమంలో పోటీలు నిర్వహించడంతో గెలుపొందిన వారికి నిర్వాహకులు బహుమతులు కూడా ప్రధానం చేశారు.

**దేవాలయాల్లో భక్తి భజనలు**

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా పలు దేవాలయాల్లో హరే కృష్ణ హరే కృష్ణ.. నామస్మరణతో ఉదయం నుండి సాయంత్రం వరకు భక్తులు భజన నిర్వహించారు. వరంగల్ నగరంలోని మట్టెవాడ ప్రాంతంలో ఉన్నటువంటి శ్రీకృష్ణ మందిరంలో స్వామివారిని వేలాది మంది దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు అందించారు. ఇక్కడ శ్రీకృష్ణ భజనలతో భక్తి భావం కలిగించారు. ఎక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉదయం నుండి సాయంత్రం వరకు పోలీసులు తగిన బందోబస్తు నిర్వహించారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆయా ఆలయాల నిర్వాహకులు భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కలిగించారు.

## నూతన ఎస్సైకి స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు




**కెరమెరి సెప్టెంబర్ 4 (జనంసాక్షి)** కెరమెరి మండల పోలీస్ స్టేషన్‌లో నూతనంగా ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన కె.రాజును శుక్రవారం నాడు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్ నేతృత్వంలో గోయగావ్ సర్పంచ్ ఆనందరావు, ఉపసర్పంచ్ మోహర్లే రామ్ దాస్, వార్డు సభ్యులు రాము,తిరుపతి, బుచ్చన్న పర్ది తదితరులు ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై రాజు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు.

# వెయ్యి రోజుల పాలన.. హామీల అమలేది?

- కాంగ్రెస్ పాలనలో అవినీతి, అక్రమాలే రాజ్యమేలుతున్నాయి : బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహారావు
- సీతక్కకు 10 ప్రశ్నలు హామీల లెక్క చెప్పాలని డిమాండ్



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 4 (జనంసాక్షి):** కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో తెలంగాణలో అభివృద్ధి శూన్యమైందని బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శుక్రవారం ఏటూరునాగారంలో పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన చేపట్టారు. మహిళలు ఓడగూడెం నుంచి బస్టాండ్ వరకు సుమారు మూడు కిలోమీటర్లు ర్యాలీ నిర్వహించి, ధర్నాచౌక్‌లో వంటావార్పుతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. మహిళా సంక్షేమం, రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, రూ.500 గ్యాస్, పెన్షన్లు, కళ్యాణలక్ష్మి తదితర హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్, నూతన బస్టాండ్, ఆర్టీసీ డిపో, గోదావరి కరకట్ట, కమలాపూర్ ఫ్యాక్టరీ, పోడు భూములు, ఐటీడీఏ బలోపేతం వంటి అంశాలపై మంత్రి సీతక్కకు పది ప్రశ్నలు సంధించారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా గత ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు. ప్రభుత్వ పనితీరును ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఐ శ్రీనివాస్‌ను సన్మానించిన
# అభ్యుదయ యువజన సంఘం




**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 04 (జనంసాక్షి) :** స్టేషన్‌ఘన్పూర్ నూతన సిఐగా శ్రీనివాస్ బాధ్యత చేపట్టిన సందర్భంగా స్టేషన్ ఘన్‌పూర్ పట్టణకేంద్రంలోని పోలీస్ స్టేషన్లో అభ్యుదయ యువజన సంఘం ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అభ్యు దయ యువజన సంఘం నియోజకవర్గ కన్వీనర్ పోశాల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం నూతన సీఐ శ్రీనివాస్‌ను శాలువా తో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ నాయకుడు మేకల మల్లేష్, మాజీ ఎంపీటీసీ గుర్రం ఫాతి కుమార్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు పాషా,ముదిరాజ్ సంఘం నాయకుడు చిక్కుడు రమేష్,మార్క అనిల్, కాంగ్రెస్ పార్టీ రెండో వార్డు అధ్యక్షుడు గుర్రం చిరంజీవి, శ్రీనివాస్, వెంకటేష్, గౌస్,చెక్కపల్లి రాజు,తోట బిక్షపతి తదితరులుపాల్గొన్నారు.

# వెయ్యి రోజుల ప్రజా పాలనకు సంబరాలు



**లక్ష్మణ చందా, సెప్టెంబర్ 4 (జనం సాక్షి):** కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ, వెయ్యి రోజుల ప్రజా పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా లక్ష్మణ చందా మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండ్ర నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండ్ర నరేష్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనతో పోలిస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, నిరుపేద కుటుంబాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి తెల్ల రేషన్ కార్డులు అందించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. రేషన్ కార్డుల ద్వారా పేద కుటుంబాలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు మరింత చేరువ అవుతున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు చర్యలు చేపడుతోందన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతోందని కొండ్ర నరేష్ రెడ్డి తెలిపారు. వెయ్యి రోజుల ప్రజా పాలనలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలకు అందుతున్న ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ ఎర్ర రఘునందన్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, తాజా మాజీ జెడ్పిటిసి ఓస రాజేశ్వర్, మండల సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచి యాదగిరిపై వచ్చిన ఆరోపణలు అవాస్తం



**వేలేరు సెప్టెంబర్ 4(జనం సాక్షి)** వేలేరు గ్రామ సర్పంచ్ బిల్లా యాదగిరిపై వచ్చిన ఆరోపణలపై స్పందించిన పారిశుద్ధ్య కార్మికులు సర్పంచ్‌పై వచ్చిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవం, అర్థరహితం...వేలేరు గ్రామ పంచాయతీ సిబ్బంది. వేలేరు గ్రామ సర్పంచ్ బిల్లా యాదగిరి గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో తన ఇంటి పనులు,వ్యక్తిగత పనులు, వెంచర్ లో చెట్లకు నీళ్లు పోయడం, పోలం పనులు చేయించుకుంటున్నారని వచ్చిన వార్త కథనాలు వచ్చినవి పూర్తిగా అవాస్తవం.సర్పంచ్ నాన్న ఇంటి వద్ద పనిచేసిన సిబ్బందిని వివరణ కోరగా సర్పంచ్ తమను ఏనాడూ కూడా తన ఇంటి దగ్గర, తన కుటుంబ సభ్యుల ఇళ్ల వద్ద ఏనాడూ పని చేయాలని ఆదేశించలేదని, ప్రమేయం లేకుండానే నేను వాళ్ల నాన్న ఇంటి ముందు పనిచేయడం జరిగింది చెప్పింది.ప్రతిసారి గ్రామం శుభ్రంగా ఉండాలని, ప్రజలు ఆరోగ్య వంతంగా ఉండాలనే ఉద్దేశ్యం తమతో పారిశుద్ధ్య పనులు చేయాలని మాత్రమే చెప్పుతాడని , తన పదవి కాలంలో వచ్చే గౌరవ వేతనం తమకే ఇస్తున్నారని అన్నారు. అలాంటి వ్యక్తి పై ఆరోపణలు పూర్తిగా అవాస్తవం. గ్రామ సర్పంచ్ నిత్యం గ్రామ పంచాయతీ లో అందుబాటులో ఉంటూ వేలేరు గ్రామ అభివృద్ధి కి కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరయ్య, ఆనంద్, ప్రమీల, లక్ష్మి, భాగ్యలక్ష్మి.తదితరులు పాల్గొన్నారు..

# రామప్ప అందాలకు ఫిదా అయిన 'బలగం' ఫేమ్ నటుడు

- రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు
- కాకతీయుల శిల్పకళ సంపద అద్భుతం
- నేటితో నా ఎన్నో ఏళ్ల కల నెరవేరింది
- ప్రముఖ సినీ నటుడు మురళీధర్ గౌడ్



**వెంకటాపూర్(రామప్ప),సెప్టెంబర్4(జనం సాక్షి):-** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలో గల ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రామప్ప దేవాలయం అందాలకు ప్రముఖ సినీ నటుడు, 'బలగం' ఫేమ్ మురళీధర్ గౌడ్ ఫిదా అయ్యారు. ఈ మేరకు ఆయన మంగళవారం రామప్ప దేవాలయాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్ ఘనంగా స్వాగతం పలికారు. కాగా,ఆయన కుటుంబసభ్యులతో రామలింగేశ్వర స్వామి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, అర్చకులు వారి స్వామి వారి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.అదేవిధంగా టూరిజం గైడ్ తాడబోయిన వెంకటేష్ వారికి ఆలయ చరిత్ర, శిల్పకళా విశిష్టత గూర్చి వివరించారు. ఈ సందర్భంగా మురళీధర్ గౌడ్ మాట్లాడారు...రామప్ప గురించి చాలా సార్లు విన్నాను.చాలా ఏళ్లుగా రామప్ప దేవాలయాన్ని చూడాలనుకున్నా.ఇక్కడి శిల్పాలు, ఆలయ నిర్మాణం అద్భుతంగా ఉంది.కాకతీయుల కళా నైపుణ్యానికి రామప్ప దేవాలయమే నిదర్శనంగా నిలుస్తుంది.రామప్పను చూడాలన్న నా కల నేటితో నెరవేరిందని ఆయన అన్నారు. అనంతరం ఆయన కుటుంబ సమేతం గా రామప్ప చెరువు వద్దకు చేరుకుని చెరువు లో బోటింగ్ చేస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు.మురళీధర్ గౌడ్ బలగం, రంగస్థలం, డీజే టిల్లు, పుష్ప-2, భగవంత్ కేసరి, మ్యాడ్, సంక్రాంతికి వస్తున్నాం...వంటి తదితర హిట్ చిత్రాల్లో నటించి ప్రేక్షకులకు దగ్గరయ్యారు.ఆయన వెంట ఆలయ ఈవో ఇమ్మడి భాస్కర్,టూరిస్ట్ పోలీసులు అరుణ్ కుమార్, భద్రు, శ్రీకాంత్, దేవాదాయ, పురావస్తు,టూరిజం శాఖల సిబ్బంది ఉన్నారు.

## శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే గండ్ర
# భక్తిశ్రద్ధలతో పట్టు వస్త్రాల సమర్పణ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి పట్టణంలోని మంజూర్‌నగర్‌లో కొలువైన శ్రీ భూనీలా సమేత వేంకటేశ్వర స్వామివారికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శు క్రవారం భక్తిశ్రద్ధలతో పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయంలో నిర్వహించిన తృతీయ వార్షికోత్సవం, పవిత్రోత్సవాలు, శ్రీకృష్ణాష్టమి పర్వదిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తుల కోసం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం 10వ వార్డు కౌన్సిలర్ పుల్లూరి మంజుల--మాధవరావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, ఆలయ చైర్మన్ అన్నమనేని గోపాల్‌రావు, డైరెక్టర్లు కేతిరి శుభాష్, అయితు రమేష్, నాలిక పరమేశ్వరి, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న 30 పశువుల పట్టివేత



**రామకృష్ణాపూర్, సెప్టెంబర్04(జనంసాక్షి):** అక్రమంగా పశువులను తరలిస్తున్న మూడు మహీంద్రా క్యాంపర్ వాహనాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. కౌటాల నుంచి జగిత్యాల జిల్లా రాజారాంపల్లి మార్కెట్‌కు పశువులను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో మందమర్రి టోల్‌ప్లాజా వద్ద టాస్క్ ఫోర్స్ పోలీసులుతనిఖీలు నిర్వహించగా, మూడు వాహనాల్లో 13 ఆవులు, 17 దూడలు కలిపి మొత్తం 30 పశువులను గుర్తించారు. ఈ వ్యవహారంలో ముగ్గురు డ్రైవర్లు, నలుగురు సహాయకులు కలిపి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు వాహనాలు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్‌రావు నేతృత్వంలో ఈ తనిఖీలు చేపట్టారు. నిందితులు, వాహనాలు, పశువులను తదుపరి చర్యల కోసం మందమర్రి పోలీసులకు అప్పగించారు.

## అక్రమ ఇసుక రవాణా.. అధికారుల నిఘా ఎక్కడ?

### పగటిపూటే ఇసుక తరలింపు పట్టించుకోని సంబంధిత అధికారులు?



**దస్తూరాబాద్, సెప్టెంబర్ 04 (జనంసాక్షి):** గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా రహదారిపై ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్ దృశ్యం దీనికి నిదర్శనంగా కనిపిస్తోంది. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారా? లేక సంబంధిత శాఖల అనుమతులతోనే రవాణా జరుగుతోందా? అనే ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక తవ్వకం, రవాణాపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉన్నప్పటికీ పగటిపూటే ఇసుక ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుంటే అధికారుల నిఘా ఎంతవరకు ఉందన్నది చర్చనీయాంశంగా మారింది. ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే అడ్డుకోవాల్సిన అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇసుక రవాణా చేస్తున్న వాహనాలకు అనుమతులు ఉన్నాయా? రవాణా చేస్తున్న ఇసుక ఎక్కడి నుంచి వస్తోంది? ఎక్కడికి తరలిస్తున్నారు? అనే అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేయాల్సిన అవసరం ఉంది. అక్రమ ఇసుక రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడటంతో పాటు పర్యావరణానికి నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఇసుక రవాణా వాహనాలను తనిఖీ చేసి, అనుమతులు లేని రవాణాపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## పాండ్య తండాలో పోషకాహార వారోత్సవాలు



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 4 ( జనం సాక్షి):** మండలంలోని తిమ్మరాయినిపహాడ్ సెక్టార్‌లో గల చెరువు కొమ్ము తండా గ్రామంలోని పాండ్యతండా అంగన్వాడి కేంద్రంలో ఘనంగా పోషకాహార వారోత్సవాలను అంగన్వాడీ టీచర్ రాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలకు, నవజాత శిశువు ఎదుగుదలకు కావలసిన పౌష్టిక విలువలు కలిగిన పోషక ఆహార పదార్థాలు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు , పాలు, గుడ్లు అన్నిటిని వారికి చూపిస్తూ అందులో ఉండే విటమిన్లు, లవణాలు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు మంజుల, రమ, ఉమ, గ్రామ సర్పంచ్ భూక్య మహబూబ్ సింగ్ రాథోడ్, గర్భిణీ స్త్రీలు మౌనిక, అనూష, మహిళలు బుజ్జి, కమల, కళ్యాణి, గ్రామ కార్యదర్శి ప్రియాంక, అమృతండ పాఠశాల ఉపాధ్యాయులు బానోతు వెంకన్న, భూక్య రాజు, చల్ల విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ వంట వార్పు నిరసన కార్యక్రమం

### మాజీ డిసిసిబి డైరెక్టర్ గుండ్రెడ్డి రాజేశ్వర్ రెడ్డి



**ధర్మసాగర్ సెప్టెంబర్ 4 (జనం సాక్షి)** తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం నాడు వంటవార్పు కార్యక్రమాన్ని మాజీ డిసిసిబి డైరెక్టర్ గుండ్రెడ్డి రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ధర్మసాగర్‌లో నిర్వహించడమైనది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ డిసిసిబి డైరెక్టర్ గుండ్రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి హాజరైనారుబస్థానిక ధర్మసాగర్ ఎస్సీ కమ్యూనిటీ హాల్ నుండి ధర్మసాగర్ వేలేర్ మండలాల బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు మండల ముఖ్య నాయకులు పార్టీ కార్యకర్తలతో భారీ ర్యాలీతో ప్రారంభమై అమరవీరుల స్థూపం వరకు ఆటపాటలతో డప్పుల వాయిద్యాలతో కళాకారులతో భారీ ర్యాలీ నిర్వహించి అమరవీరుల స్తూపానికి పూలమాల వేసినారు. మాజీ డిసిసిబి గుండ్రెడ్డి రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తున్నారు కాంగ్రెస్ పార్టీ ఆరు హామీలు ఇస్తున్నామని చెప్పి ఏ ఒక్కటి నెరవేర్చలేదు ఎన్నికల గ్యారెంటీ ప్రకారం ప్రజలకు ఇవ్వవలసిన కాంగ్రెస్ బాకీ మహిళలకు నెలకు 2500 హామీ 33 నెలలకు ఒక్కొక్కరికి 82 వేల 500 బాకీ కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ఆడబిడ్డల పెండ్లిలకు తులం బంగారం బాకీ వృద్ధులకు బీడీ కార్మికులకు పెన్షన్ నెలకు 4000 రూపాయలు హామీ 33 నెలలకు ఒక్కొక్కరికి 66 వేలు బాకీ విద్యార్థినులకు స్కూటీ బాకీ దివ్యాంగుల పెన్షన్ నెలకు ఒక్కొక్కరికి 6000 హామీ 33 నెలలకు 66000 బాకీ ఫీజు రియంబర్స్మెంట్ విద్యార్థుల ఫీజు బకాయిలు ఒక్కొక్కరికి 12000 బాకీ ఇవి అన్ని ఇవ్వకుండా వెయ్యి రోజుల పాలన అని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు అని అన్నారు తదనంతరం ధర్మసాగర్ మండలాల గ్రామ సర్పంచులు మాట్లాడుతూ తెలంగాణలో ప్రజలందరూ సుఖంగా జీవిస్తాలేరని ఇప్పటికైనా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేర్చాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ మాజీ కోఆప్షన్ నెంబర్ జుబేదా బేగంలాల్ ధర్మసాగర్ మండలాల బి ఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మండల నాయకులు బిఆర్ఎస్ పార్టీ వివిధ గ్రామ శాఖల అధ్యక్షులు ప్రస్తుత సర్పంచులు మాజీ సర్పంచ్లు వార్డు మెంబర్లు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యతోనే సాధికారత సాధ్యం - డాక్టర్. పృథ్వీరాజ్ వల్లాల

### గురుకుల విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం



**ఖిలా వరంగల్, సెప్టెంబర్ 04 (జనం సాక్షి)** విద్యతోనే మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించగలరని కాకతీయ విశ్వవిద్యాలయ సహాయ రిజిస్ట్రార్, వాసవి క్లబ్ నవనిర్మాణ కోచ్ డా. పృథ్వీరాజ్ వల్లాల అన్నారు.వాసవి వారోత్సవాల్లో భాగంగా వాసవి క్లబ్ వనితా టెంపుల్, హనుమకొండ ఆధ్వర్యంలో రంగశాయిపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల (ములుగు , మహబూబాబాద్)లో కళాశాల బాలికలకు మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాసవి క్లబ్ వనితా టెంపుల్ అధ్యక్షురాలు చిన్నాల హరిత అధ్యక్షతన, కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్.వి.ఎన్. చారి సమక్షంలో కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా మహిళా సాధికారతకు స్ఫూర్తినిచ్చిన మహిళల విజయాలు, వారి ప్రతిభ, సాధించిన ప్రగతిని కళాశాల బాలికలు పిపిటి ప్రజెంటేషన్ల ద్వారా ప్రదర్శించారు. విద్య, ఆత్మవిశ్వాసం, నైపుణ్యాభివృద్ధి ద్వారా మహిళలు తమ భవిష్యత్తును తామేనిర్మించుకోవాలని వక్తలు సూచించారు. విద్యార్థినులు సైబర్ నేరాల బారిన పడకుండా మొబైల్ ఫోన్‌ను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. మోసపూరిత లింకులు, అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ మంచాల విజయ్ కుమార్, రీజియన్ చైర్మన్ డా. సోమ శ్రీధర్, డిస్ట్రిక్ట్ ట్రెజరర్ శ్రీరామ్ రవీందర్, ఐపిసి వల్లాల శైలజ , క్లబ్ సెక్రటరీ సునీత, ట్రెజరర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

## కూలిన గోడలు.. అస్తవ్యస్తంగా డ్రైనేజీ!

- ప్రజల అవస్థలు అధికారులకు కనిపించడం లేదా?
- ఇంటి యజమాని నిర్లక్ష్యమా.. అధికారుల నిర్లక్ష్యమా





**దస్తూరాబాద్, సెప్టెంబర్ 04 (జనంసాక్షి):** కూలిపోయిన గోడల శిథిలాలు రహదారి పక్కనే పేరుకుపోయి ఉండగా, మరోవైపు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో మురుగునీరు సక్రమంగా వెళ్లే పరిస్థితి లేక పరిసరాలు అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి.కూలిన గోడల వద్ద శిథిలాలు తొలగించకపోవడం, డ్రైనేజీని శుభ్రం చేయకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని చెబుతున్నారు. గ్రామాల్లో కూలిన నిర్మాణాల శిథిలాలు, డ్రైనేజీలు, రహదారుల శుభ్రతపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే ప్రాంతంలో ఇంతటి దుస్థితి నెలకొన్నా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కూలిన గోడలు అధికారుల కంటికి కనిపించడం లేదా? అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీపై కనీస పర్యవేక్షణ లేదా? ప్రజలు ఫిర్యాదు చేసే వరకు అధికారులు వేచి చూస్తున్నారా? ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి కూలిన గోడల శిథిలాలను తొలగించి, డ్రైనేజీని పూర్తిస్థాయిలో శుభ్రం చేసి, మురుగునీరు నిల్వ కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి సంబంధిత ఇంటి యజమాని తో మాట్లాడి తక్షణమే పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి సాధ్యం

- చిల్పూర్ దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు
- కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల విజయోత్సవ ర్యాలీ




**స్టేషన్ ఘన్‌పూర్,సెప్టెంబర్ 04(జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలోనే దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతున్నదని, కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి సాధ్యమని చిల్పూర్ గుట్ట బుగులు వెంకటేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ చిల్పూర్ మండలఅధ్యక్షుడు చిర్ర నాగరాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనపై కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా పాలనలో చేసిన అభివృద్ధి పనులు వెయ్యి రోజులు విజయవంతమైన సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆదేశాల మేరకు చిల్పూర్ మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్పూర్ దేవస్థాన చైర్మన్ పొట్ల పల్లి శ్రీధర్ రావు మాట్లాడుతూ రెండున్నరసం వత్సరాల్లో నియోజకవర్గంలో ఊహించని అభివృద్ధి జరిగిందని అన్నారు.ఎన్నికల సంద ర్భంగా ఇచ్చిన హామీలను కాకుండా ఇవ్వని హామీలను కూడా నెరవేరుస్తూ వస్తుందన్నా రు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కి వచ్చిన నాటి నుంచి రైతు భరోసా,ఎకరాకు పెట్టుబడి సహాయం పెంపు, రైతు రుణమాఫీ, పంట బీమా, సన్న వడ్లకు బోనస్ అందజేయడం జరుగుతుందన్నారు. గృహజ్యోతి ద్వారా అర్హులైన కుటుంబాలకు నెలకు 200 యూని ట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నారని, 500కే గ్యాస్ సిలిండర్ ఇవ్వడంద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉపశమనం కలుగుతుందన్నా రు.మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, మహిళా సాధికారతకు పెద్ద అడుగు, ఇందిరమ్మ ఇళ్లు,పేద కుటుంబా లకు సొంతింటికల నెరవేర్చే కార్యక్రమం, కొత్త రేషన్ కార్డులు,సన్నబియ్యంపంపిణీ,అర్హులైన పేద కుటుం బాలకు ఆహారభద్రత,యువతకు ఉద్యోగాలు మహిళా సంఘాలకు ప్రోత్సాహ కంగా రుణాలు, మహిళాశక్తి కార్యక్రమాలు, వెయ్యి బస్సుల ద్వారా స్వయం ఉపాధికి అవకాశం,ప్రభుత్వపాఠశాలల్లో నర్సరీ నుంచి 12 వ తరగతి వరకు విద్య, విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, లంచ్, స్నాక్స్ కార్యక్రమాలు ఇలా ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. రోడ్లు, వంతెనలు, తాగునీరు, పట్టణ మౌలిక వసతుల వంటి అభివృద్ధి పనులకు ప్రాధాన్య త ఇస్తున్నారని అన్నారు. రైతు సంక్షేమం, మహిళా సాధికారత,యువతకు ఉద్యోగాలు, పేదలకు ఇల్లు,విద్య,అభివృద్ధి కాంగ్రెస్ ప్రభు త్వ ప్రజాపాలన లక్ష్యమన్నారు. ఈ కార్యక్ర మంలో చిల్పూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షుడు చిర్ర నాగరాజు, కాంగ్రెస్ నాయకులు గడ్డమీది సురేష్, బొమ్మిశెట్టి బాలరాజు, నరసింహారెడ్డి, గూగులోతు ఉమ్లు నాయక్, రత్నాకర్ రెడ్డి, సుధాకర్, సమ్మయ్య, రూప్లా, వెంకటేశ్వర్లు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సీఐ శ్రీనివాస్‌ను సన్మానించిన కాంగ్రెస్ జిల్లా నాయకుడు పోగుల సారంగపాణి



**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 04(జనం సాక్షి) :** స్టేషన్ఘన్పూర్ నూతన సిఐగా శ్రీనివాస్ బాధ్యత చేపట్టిన సందర్భంగా స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో కబడ్డీ అసో సియేషన్ జిల్లా చైర్మన్, మున్నూరు కాపుసం ఘం రాష్ట్ర నాయకుడు,కాంగ్రెస్ జిల్లా నాయ కుడు మాజీ సర్పంచ్ పోగుల సారంగపాణి ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోగుల సారంగపాణి ఆధ్వ ర్యంలో శుక్రవారం నూతన సీఐ శ్రీనివాస్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈకార్య క్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు చేపూరి ప్రభాకర్,పోగుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విడిసి ఏర్పాటుపై విచారణ జరిపి పనులు నిలిపివేయాలి

### గొట్టం భూమయ్య, జిల్లా అధ్యక్షులు, నాయకపోడు సేవా సంఘం



**కాటారం సెప్టెంబర్ 4 (జనం సాక్షి) :** మేడిపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేసి, విడిసి ఏర్పాటు, సభ్యుల ఎంపిక, తీర్మానాలపై వస్తున్న ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరపాలని నాయకపోడు సేవా సంఘం జిల్లా అధ్యక్షులు గొట్టం భూమయ్య డిమాండ్ చేశారు.గ్రామసభ నిర్వహించకుండా విడిసి ఏర్పాటు చేశారనే ఆరోపణలు, ఇతర గ్రామాలకు చెందిన వ్యక్తులను కమిటీలో చేర్చారనే అభ్యంతరాలు, తీర్మానాలు--సంతకాలపై వచ్చిన ఫిర్యాదులను అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించాలని కోరారు. గ్రామసభ నిర్వహించి, స్థానిక గిరిజనుల భాగస్వామ్యంతో నూతన విడిసి కమిటీ ఏర్పాటు చేసిన తర్వాతే పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు. విచారణ పూర్తయ్యే వరకు పనులు కొనసాగిస్తే జిల్లా స్థాయిలో ఆందోళనను ఉధృతం చేసి, అవసరమైతే ఐటీడీఏ కార్యాలయ ముట్టడి కార్యక్రమం చేపడతామని గొట్టం భూమయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గుంటి లక్ష్మణ్, మేడిపల్లి గ్రామ అధ్యక్షులు బోధ ఓదెలు, గ్రామ యువకులు గాదె మహేష్, మాజీ సర్పంచ్ చింతల సుధాకర్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మహిళలు వంటావార్పు

- 420 అడుగుల హామీల ఫ్లెక్సీతో మహిళల ర్యాలీ
- జాతీయ రహదారిపై ధర్నా



**రాయపర్తి,సెప్టెంబర్ 04 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళతో శుక్రవారం రాయపర్తి మండల కేంద్రంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ కమిటీ పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు చేపడుతున్న పోరాట కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు.రాయపర్తి బస్టాండ్ ఆవరణ నుంచి సుమారు వెయ్యి మంది మహిళలతో భారీ ర్యాలీ నిర్వహించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రతిబింబించేలా 420 హామీలకు సంబంధించిన 420 అడుగుల ఫ్లెక్సీతో ర్యాలీ చేపట్టారు.అనంతరం బస్టాండ్ ఆవరణలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించి,జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ మంత్రి,పాలకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం,కేసీఆర్ కిట్,కల్యాణలక్ష్మి,విద్యార్థినులకు స్కూటీలు తదితర హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం మహిళలతో కలిసి వంటావార్పు కార్యక్రమంలో భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్,బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి,రాయపర్తి మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు,మహిళలు,పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో ప్రథమ ర్యాంక్ సాధించిన హరికుమార్



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 4 (జనం సాక్షి)** :ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో 2024--25 విద్యా సంవత్సరానికి నిర్వహించిన పీహెచ్‌డీ సంస్కృత ప్రవేశ పరీక్షలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సంస్కృత అధ్యాపకులు వేదాంతం హరికుమార్ ప్రథమ ర్యాంక్ సాధించారు. ఈ ప్రతిభతో ఆయన 2024--25 పరిశోధన విద్యా సంవత్సరానికి 2026 సెప్టెంబర్ 2న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పరిశోధకుడిగా ప్రవేశం పొందారు.వేదాంతం హరికుమార్ 2013 నుంచి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సంస్కృత అధ్యాపకుడిగా సేవలందిస్తూ విద్యార్థులకు సంస్కృత భాష, సాహిత్యంపై బోధన అందిస్తున్నారు. అధ్యాపక వృత్తితో పాటు పరిశోధన పట్ల ఆసక్తిని కొనసాగిస్తూ పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో ప్రథమ ర్యాంక్ సాధించడం విశేషమని కళాశాల అధ్యాపకులు పేర్కొన్నారు.పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో ప్రథమ ర్యాంక్ సాధించి ప్రతిష్టాత్మక ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పరిశోధనకు ప్రవేశం పొందిన వేదాంతం హరికుమార్‌ను కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు. ఆయన భవిష్యత్తులో సంస్కృత భాష, సాహిత్య రంగంలో మరింత విశిష్టమైన పరిశోధన చేసి కళాశాలకు, విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని

## పరకాల ఇందిరా మహిళా డెయిరీ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



**ఆత్మకూర్/ దామెర సెప్టెంబర్ 4 (జనం సాక్షి):** దామెర మండలం కేంద్రంలో నిర్మిస్తున్న పరకాల ఇందిరా మహిళా డెయిరీ నిర్మాణ పనులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. డెయిరీ నిర్మాణానికి సంబంధించిన ప్రణాళిక, స్థల పరిస్థితులు, రహదారి సౌకర్యం తదితర అంశాలను అధికారులతో కలిసి పరిశీలించి,పలు సూచనలు చేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యం తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు.రైతులకు పాడి పరిశ్రమ ద్వారా అదనపు ఆదాయ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా డెయిరీని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. డెయిరీ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.దామెర తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి తదితరులు ఉన్నారు.

## సాంగ్వి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభోత్సవం సర్పంచ్ విమలభాయి





**కెరమెరి సెప్టెంబర్ 4 (జనంసాక్షి)** కెరమెరి మండలం సాంగ్వి గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను గురువారం సర్పంచ్ కార్వెత విమలబాయి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వాడై సోని – ప్రకాష్ దంపతులను అభినందించి, వారి నూతన గృహంలో కుటుంబంతో కలిసి కొద్దిసేపు గడిపి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సర్పంచ్ విమలబాయి మాట్లాడుతూ... నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సిడం హీరు, గ్రామ పెద్దలు శంకర్, మెంగు, సుంగు, బాపూరావు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

### శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారణలో చిన్నారులు



**స్టేషన్ ఘన్‌పూర్,సెప్టెంబర్ 04 (జనం సాక్షి) :** ధర్మాన్ని కాపాడి, అధర్మాన్ని అంతం చేసి, మానవాళికి భగవద్గీత ద్వారా కర్మ, ధర్మం, సత్యం, న్యాయం వంటి విలువలను బోధించిన శ్రీకృష్ణ పరమాత్మ జన్మదినమైన ఈ పవిత్ర శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో, ప్రైవేట్ పాఠశాలల్లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మ అష్టమి సందర్భంగా శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారణలో తాటికొండ గ్రామానికి చెందిన కుసుమ సంధ్యారాణి – అనిల్ కుమార్ దంపతుల కుమారుడు, కూతురు కుసుమ అభిజ్ఞాన్, కుసుమ శ్రేయాన్వీ పలువురుని ఆకట్టుకున్నారు. శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా దేవాలయా ల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో ఉట్లు కొట్టే కార్యక్రమం చేపట్టారు.

## కుభీర్ మండలంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**కుభీర్, సెప్టెంబర్ 04, (జనంసాక్షి):** కుభీర్ మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని మండల కేంద్రమైన కుభీర్‌తో పాటు పార్డి (బి), పల్సి, సోనారి, మలేగాం తదితర గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా భక్తులు శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. మండల కేంద్రంలోని బట్టి గల్లీలో శ్రీ కృష్ణ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఉట్టి కొట్టే' కార్యక్రమం ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ఉట్టిని కొట్టేందుకు పోటీ పడ్డారు. ఈ వేడుకను చూసేందుకు స్థానిక ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ వేడుకల్లో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనల్లో చిన్నారులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో అలరించాయి. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మండలవ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలతో గ్రామాల్లో భక్తిసందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- అనారోగ్య బాధితులకు అండగా సీఎం సహాయ నిధి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గణపురం, భూపాలపల్లి మండలాలకు చెందిన సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చెక్కులను పంపిణీ చేశారు. గణపురం మండలానికి చెందిన 29 మంది లబ్ధిదారులకు రూ. 7,13,600 విలువైన చెక్కులు, భూపాలపల్లి మండలానికి చెందిన 31 మంది లబ్ధిదారులకు రూ. 7,03,500 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ వివిధ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. అనారోగ్యంతో కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. వైద్య చికిత్సల కోసం భారీగా ఖర్చు చేయాల్సి రావడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు అప్పులపాలు కాకుండా ప్రభుత్వం అందిస్తున్న సీఎంఆర్ఎఫ్ సాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. సీఎంఆర్ఎఫ్ సాయం అవసరమైన అర్హులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## విజ్‌డమ్ ప్రీ స్కూల్‌లో కన్నుల పండువగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**నర్సంపేట సెప్టెంబర్ 4 ( జనం సాక్షి)** చిన్నారుల చిరునవ్వులు... శ్రీకృష్ణుడి, గోపికల వేశాధారణలో వారి ముద్దుముద్దు రూపాలు... భక్తి గీతాలతో మార్మోగిన ప్రాంగణం... ఇలా విజ్‌డమ్ ప్రీ స్కూల్, నర్సంపేటలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఆనందోత్సాహాలతో, ఆధ్యాత్మిక శోభతో ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ జావేద్ . ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల పట్ల ప్రేమను పెంపొందించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ వేడుకలు ప్రతీ ఒక్కరి హృదయాన్ని హత్తుకున్నాయి. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధాదేవి వేషధారణలో మురిపిస్తూ, తమ అమాయకమైన చిరునవ్వులతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మనసులను ఆనందంతో నింపారు. ఈ వేడుకలను పాఠశాల కరెస్పాండెంట్ జహంగీర్, డైరెక్టర్ జావేద్ . ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి డైరెక్టర్ జావేద్ . శ్రీకృష్ణాష్టమి పండుగ ప్రాముఖ్యతను, శ్రీకృష్ణుడి జీవిత సందేశాలను వివరించారు. "పిల్లల హృదయాల్లో మంచి విలువలు, ప్రేమ, నిజాయితీ, ధైర్యం వంటి సద్గుణాలను నాటడమే నిజమైన విద్య" అని ఆయన పేర్కొన్నారు. చిన్నారుల అమాయకత్వంలో శ్రీకృష్ణుడి బాల్యాన్ని చూసిన ఈ వేడుక తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మరపురాని మధుర జ్ఞాపకంగా నిలిచింది. పుస్తకాలలో నేర్చుకునే సంస్కృతిని జీవితంలో అనుభవించేలా చేయడం తోపాటు నైతిక విలువలు పెంపొందించడమే విజ్‌డమ్ ప్రీ స్కూల్ లక్ష్యమని కరస్పాండెంట్ జహంగీర్. తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ ఫహీమ్ సుల్తానా, అకాడమిక్ అడ్వైజర్ నాజియా ఇక్బాల్, ఇన్చార్జి హారిక, శ్రీలత, భద్రయ్య, మధు, సంతోష్,ఉపాధ్యాయులు దివ్య, మాధవి, సరితా రాణి, రాధిక, స్వాతి, అఖిల, రజనీ కుమారి, సౌజన్య, రవళి, సుజాత, కళ్యాణి తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి
- వెయ్యి రోజుల పాలనపై గులాబీ గర్జన
- నల్లబెల్లిలో బీఆర్ఎస్ 'వంటా--వార్పు' నిరసన



**నల్లబెల్లి, సెప్టెంబరు 04(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా శుక్రవారం నల్లబెల్లి బస్టాండ్ ఆవరణలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'వంటా--వార్పు' నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలన ప్రజా సంక్షేమానికి విరుద్ధంగా సాగుతోందని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, వందలాది హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులు, మహిళలు, పింఛనుదారులు, దివ్యాంగులు, ఆటో కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజా సమస్యలను ప్రశ్నించే వారిపై అణచివేత ధోరణి అవలంబిస్తున్నారని మండిపడ్డారు. కేటీఆర్ పిలుపు మేరకు ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని, వచ్చే ఎన్నికల్లో నర్సంపేటతో పాటు రాష్ట్రవ్యాప్తంగా గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, మాజీ ఫ్యాక్స్ చైర్మన్ చెట్టుపెల్లి మురళీధర్ రావు, మాజీ మండల అధ్యక్షుడు ఊడుగుల ప్రవీణ్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు రాజేశ్వర్‌రావు, క్లస్టర్ బాధ్యులు గందె శ్రీనివాస్‌గుప్తా, మామిండ్ల మోహన్‌రెడ్డి, కొత్తపెల్లి కోటిలింగాచారి, మహిళా అధ్యక్షురాలు గోనె శ్రీదేవి, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థను అధ్యయనం చేయడానికి జపాన్ దేశ పర్యటనకు వెళ్తున్న మండల విద్యాశాఖ అధికారి కొయ్యడ మల్లయ్య






ఏటూరునాగారం,సెప్టెంబర్ 04 (జనంసాక్షి). తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో "టీచర్స్ ఎక్స్పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం"లో భాగంగా జపాన్ దేశంలో విద్యా వ్యవస్థను అధ్యయనం చేయడానికి ములుగు జిల్లా, ఏటూరునాగారం మండలంలోని జడ్పీహెచ్ఎస్ రామన్నగూడెం పాఠశాల హెడ్మాస్టర్ కొయ్యడ మల్లయ్య ఈనెల 6వ తేది నుండి 12వ తేది వరకు జపాన్ దేశంలో పర్యటించి అక్కడ ఉన్నటువంటి పాఠశాల విద్యా వ్యవస్థను పరిశీలించి, పరిశోధన చేసి రావడానికి 40మంది సభ్యుల బృందంతో జపాన్ బయలుదేరుతున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈ నవీన్ నికోలస్, అసిస్టెంట్ డైరెక్టర్ లింగయ్య, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ జి రమేష్, ఎస్సీఈఆర్టీ హైదరాబాదులో ఈనెల 2వ తేదిన వీరందరికీ వీసాలు అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ పాఠశాల విద్యను అభివృద్ధి చేయడానికి నూతన పద్ధతులను, విధి విధానాలను, అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసి రావాలని సూచించారు. జపాన్ పర్యటనకు వెళ్లే బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు, అలాగే ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్ధార్థ రెడ్డి మరియు ఉపాధ్యాయ బృందం శుభాకాంక్షలు తెలిపారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమైంది : గుమ్మడి సోమయ్య

### కమలాపురంలో భారీ బైక్ ర్యాలీ చేసిన కాంగ్రెస్ నాయకులు



మంగపేట, సెప్టెంబర్ 04(జనంసాక్షి) కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలోని కమలాపురం గ్రామంలో శుక్రవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు. ఈ భారీ బైక్ ర్యాలీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా గుమ్మడి సోమయ్య మాట్లాడుతూ... పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కమలాపురం గ్రామానికి ఒక్క ఇల్లు కూడా రాలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటివిడతలో 29 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని ఆయన తెలిపారు. అలాగే మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో కమలాపురం గ్రామం అభివృద్ధి పథంలో నిలిచిందని ఆయన ఈ సందర్భంలో తెలిపారు. అలాగే బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలోనే బిల్ట్ కర్మాగారం మూతపడిందని కనీసం ఫ్యాక్టరీనీ కనిపించే విధంగా కూడా ప్రభుత్వం కృషి చేయకపోవడంతో కార్మికులందరూ రోడ్డున పడ్డారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బిల్ట్ కర్మాగారాన్ని పూర్తిగా తొలగించి నూతన ఫ్యాక్టరీ నిర్మాణం కొరకు ఇతరత్రా ప్రైవేటు సంస్థలతో చర్చలు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పరిపాలనలో అనేక సంక్షేమ ఫలాలను ప్రజలకు అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పచ్చ శేషగిరి రావు, బేవర సత్యనారాయణ, పెద్ది నర్సింహారావు, వెంకటేశ్వర్లు, చింత పున్నారావు, నిమ్మల రాంబాబు, తూడి భగవాన్ రెడ్డి, శ్రీనివాస్, గౌతం తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన పిన్నింటి బాలాజీ రావు

- నేడు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందుకోనున్న ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు



చెన్నారావుపేట, సెప్టెంబర్ 4( జనం సాక్షి ): వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పిన్నింటి బాలాజీ రావు తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని నేడు సెప్టెంబర్ 5న శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం 10 గంటలకు కొడంగల్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకోనున్నారు. ఉపాధ్యాయులు పిన్నింటి బాలాజీ రావు గత 28 సంవత్సరాలుగా విద్యా రంగంలో చేస్తున్న విశేష కృషిని గుర్తించి తెలంగాణ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడం పట్ల మండలంలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు, ఉప్పరపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో తనతో కలిసి పనిచేస్తున్న తోటి ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈయన విద్యార్థులను ఎనిమిది సార్లు రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీల్లో, 20 సార్లకు పైగా జిల్లా స్థాయి పోటీల్లో బహుమతులు సాధించేలా గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. సర్వ శిక్ష అభియాన్, రాజీవ్ విద్యా మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు ఉపాధ్యాయ శిక్షణ కరదీపికలకు రచయితగా ఉన్నారు. వందలాది విద్యా సంబంధిత ఆర్టికల్స్ ను రచించారు. పలు స్వచ్ఛంద సంస్థల్లో సభ్యునిగా ఉంటూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంక్షేమం కొరకు సేవ చేశారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ గా, జిల్లా రిసోర్స్ పర్సన్ గా అనేక రకాల శిక్షణలు ఇచ్చారు. గాంధీనగర్ ఐఐటీలో ఐదు రోజులపాటు శిక్షణ పొంది పలుకృత్యాలను విద్యార్థుల చేత చేయించారు. తోటి ఉపాధ్యాయుల సహకారంతో పాఠశాల పురోభివృద్ధికి తోడ్పడ్డారు. అందుకుగాను ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

### కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై

## గారేపల్లి కూడలిలో వంట వార్పు

- అబద్దాల హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం
- హామీలు అమలు వరకు పోరాడుతూనే ఉంటాం
- మాజీ ఎమ్మెల్యే మంథని బి ఆర్ ఎస్ ఇన్చార్జి పుట్ట మధుకర్



కాటారం సెప్టెంబర్ 4 (జనం సాక్షి ): కాటారం మండల అంబేద్కర్ చౌక్‌లో కాంగ్రెస్ వెయ్యి రోజుల పరిపాలనపై బీఆర్ఎస్ శ్రేణులు నిరసన కార్యక్రమం తెలియజేశారు . కాంగ్రెస్ 420 హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచిన హామీలు అమలు చేయలేదని నిరసిస్తూ ప్రజల పక్షాన నిరసన కార్యక్రమం చేశారు.అబద్ధపు హామీలతో గద్దెనెక్కి ప్రభుత్వం కోట్లు కొల్లగొడుతుందని ఆరోపించారు. కళ్యాణ లక్ష్మి పథకం కింద తులం బంగారం ఇస్తామని మహిళలకు ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తామని ఎన్నో అబద్దాలు చెప్పి ఇచ్చిన హామీలన్నీ మరిచారని ఆవేదన వెలిబుచ్చారు .తెలంగాణలో రైతులకు రైతుబంధు 14000 సంవత్సరానికి రెండు పంటలకు ఇస్తామని,మూడు దఫాలు ఎగొట్టిందని మహిళలకు 2500 నెలకు హామీ ఇచ్చారని వారి పేర్కొన్నారు. రైతులకు ఏరియా బస్తాలను యాప్‌లో పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. వెయ్యి రోజుల పరిపాలనలో రాష్ట్ర ప్రజలు కష్టాలు ఎదుర్కొన్నారని ఇకపై ఆర్ గ్యారంటీలు అమలు అయ్యేవరకు పోరాటం కొనసాగాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

### శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు



చెన్నారావుపేట, సెప్టెంబర్ 4 ( జనం సాక్షి): శ్రీ కృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు పలువురిని ఆకట్టుకున్నారు. మండలంలోని అక్కల్ చెడ గ్రామానికి చెందిన ముస్లిం చిన్నారులు మహమ్మద్ అబ్దుల్ అలైన, జైన్, జైద్, అలాగే చెన్నారావుపేట గ్రామానికి చెందిన పబ్బతి దియాన్స్ రెడ్డి, తరుణి రెడ్డిలు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో పలువురిని అలరించారు. అలాగే చెన్నారావుపేట మండల కేంద్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకొని శ్రీ సిద్దేశ్వర ఆలయం ఆవరణలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువకులు ఆనందంగా పాల్గొన్నారు.

## ఎల్కతుర్తి మాజీ ఎంపీపీ ఎర్రోళ్ల సీతయ్య మృతి



ఎల్కతుర్తి సెప్టెంబర్ 4 జనం సాక్షి ఎల్కతుర్తి మాజీ ఎంపిపి ఎర్రోళ్ల సీతయ్య 80 స్వగ్రామం కోతులనడుమలో అనారోగ్యంతో మృతి చెందారు ఆయన మృతి బాధాకరమని గ్రామస్తులు తెలిపారు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ సీతయ్య మొదటి రాజకీయ నాయకులు అని మండలానికి మొదటి ఎంపిపిఎంపిపిగా 1986 నుండి1990 మధ్య కాలములో కొనసాగారు తెలుగుదేశం పార్టీలో క్రియ శీల సభ్యులుగా ఉండి హుజురాబాద్ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా కొనసాగారు మాజీ ఎమ్మెల్యే దుగ్గిరాల వెంకట్రావు మాజీ మంత్రి ఈనుగాల పెద్దిరెడ్డికి అంతంత సన్నిహితులుగా పేరుఉండగా తెలుగు దేశం హయాములో మండలానికి సంక్షేమ పథకాలు అందించిన చరిత్ర కారుడు సీతయ్య అని ఆయన మృతి బాధాకరమని కోతులనడుమ మరియు మండల ప్రజలు మృతికి ప్రగడ సంతాపశీ తెలిపారు.

## రామాలయంలో భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



**రెబ్బెన,సెప్టెంబర్ 04(జనం సాక్షి):** రెబ్బెన మండల కేంద్రంలోని రామాలయంలో శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు. గ్రామ ఉపసర్పంచ్ పి. వరలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పురోహితుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో అమ్మవారికి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, కుంకుమార్చనలు చేశారు. మహిళలు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఒకరికొకరు కుంకుమ బొట్టు పెట్టుకుని వాయనాలు ఇచ్చుకున్నారు. మహిళలకు స్వీట్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

## పెద్దమ్మ దేవాలయంలో కృష్ణాష్టమి వేడుకలు



**మల్హర్,సెప్టెంబర్ 04(జనంసాక్షి)** మండల పరిధిలోని అన్ని గ్రామాలలో కృష్ణాష్టమి వేడుకలు చాలా ఘనంగా నిర్వహించారు.మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామంలో ముదిరాజుల కులదైవమైన పెద్దమ్మ దేవాలయంలో శుక్రవారం రోజు కృష్ణాష్టమి సందర్భంగా గుడి చైర్మన్ ముద్ర వేణి సురేష్, కుల పెద్ద మనుషుల ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా కృష్ణాష్టమి సందర్భంగా ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.ఉట్టి కొట్టడానికి యువత చాలామంది తరలివచ్చారు.ఉట్టి కొట్టే కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించి విజేతలకు నగదు బహుమతి అందజేశారు.ఈ కార్యక్రమంలో కుల పెద్ద మనుషులు చోప్పరి రాజేందర్, కారు పాకల మొగిలి,ఆకుల నర్సింగం,గోస్కుల రవీందర్, ముదిరాజ్ మండల ప్రధాన కార్యదర్శి చొప్పరి రాజు,మాత్స్య శాఖ అధ్యక్షులు, డైరెక్టర్లు బొనగిరి ఓదెలు, ఆకుల పర్వతాలు, కులస్తులు చిగురు క్రాంతి, కుంట భూమయ్య,ఆకుల రాజేశం,ఆకుల సది, ముద్రవేణి కిష్టయ్య, కారుపాకల ఓదెలు,కుంట సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధృవపత్రాలు లేకున్నా పింఛను నమోదుకు అవకాశం




**కెరమెరి, సెప్టెంబర్ 4 (జనంసాక్షి)** చేయూత పింఛన్లకు ధృవీకరణ పత్రాలు అందుబాటులో లేకున్నా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని, అయితే పరిశీలన సమయంలో వాటిని సమర్పించాలని అధికారులు సూచిస్తున్నారు. కెరమెరి మండలంలో గతంలో పింఛన్లు వచ్చి, మధ్యలో వివిధ కారణాలతో నిలిచిపోయిన వారు సైతం కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ముఖ్య కార్యనిర్వహణాధికారి దివ్యదేవరాజన్ గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. ఒంటరి మహిళలకు తహసీల్దారు ధృవీకరణ పత్రం, దివ్యాంగులకు సదరం, యూడీఐడీ, చేనేత కార్మికులకు ఆ శాఖ ఏడీ ధృవీకరణ, గీత కార్మికులకు అబ్కారీ శాఖ సర్కిల్ ఇన్ స్పెక్టర్ ధృవీకరణ పత్రం లేకున్నా ఆధార్, రేషన్ కార్డులతో దరఖాస్తు చేసుకోవచ్చని, పరిశీలన సమయంలో వాటిని సమర్పించాలని సూచించారు. మండలంలో అర్హులైన వారు వెంటనే తమ గ్రామపంచాయతీ కార్యదర్శులను లేదా మీసేవా కేంద్రాలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరారు.

# జైనూర్ ఎమ్మార్వోపై దాడి అమానుషం

### సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంఘాల డిమాండ్



**జైనూర్, సెప్టెంబర్4(జనం సాక్షి)** మండల కేంద్రంలోని ఏం.ఆర్ ఓ కార్యాలయంలో ఏం.ఆర్ ఓ ఆడ బీర్షావ్ ప్రభుత్వ విధుల్లో భాగంగా విధులు నిర్వహిస్తున్న సమయంలో, ఆత్రం నరేష్, ఏ.హెచ్.ఎస్.మహాగం సి.ఆర్ టిగా పనిచేస్తున్న వ్యక్తి, పై దాడికి పాల్పడినట్లు మా దృష్టికి వచ్చింది. ప్రభుత్వ అధికారి తన విధులను నిర్వహిస్తున్న సమయంలో ప్రభుత్వ కార్యాలయంలోకి వెళ్లి దాడికి పాల్పడటం తీవ్రంగా ఖండించదగిన విషయం. ఇలాంటి ఘటనలు ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా, ప్రభుత్వ కార్యాలయాల్లో భయాందోళన వాతావరణాన్ని సృష్టించే ప్రమాదం ఉంది. కావున, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, అందుబాటులో ఉన్న ఆధారాలు, సీసీటీవీ దృశ్యాలు మరియు ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించి, చట్ట ప్రకారం తగిన కేసు నమోదు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంఘాల తరఫున డిమాండ్ చేస్తున్నాము. అలాగే, ఆత్రం నరేష్ దొడ్డి దారిన తప్పుడు ఎస్టీ ధ్రువీకరణ పత్రం తీసుకోని ఏ.హెచ్.ఎస్ మహాగం సి.ఆర్ టి గా విధులు నిర్వహిస్తున్నందున,ఒక ఆదివాసీ ఏం.ఆర్ ఓ పై దాడికి పాల్పడిన నరేష్ పై సమగ్ర విచారణ జర్పి ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయలి.ఈ ఘటనకు సంబంధించి సంబంధిత ఉన్నతాధికారులు కూడా విచారణ జరిపి నిబంధన ప్రకారం సి.ఆర్ టి ఉద్యోగం నుండి తొలగించి తగిన శాఖాపరమైన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నాము. ప్రభుత్వ అధికారులపై ఇలాంటి దాడులు భవిష్యత్తులో పునరావృతం కాకుండా, విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించాలని కోరుతున్నాము. కావున, మా వినతిని పరిగణనలోకి తీసుకొని, ఈ ఘటనపై చట్టపరమైన మరి,శాఖాపరమైన చర్యలను త్వరితగతిన చేపట్టవలసిందిగా మనవి చేస్తున్నాము. ఈ కార్యక్రమం లో ఆదివాసీ సంఘాల పెద్దలు కొడప విసెంబర్ పటేల్ జైనూర్ గేడం గణపత్ రావ్, ఆత్రం అనంతరావు సార్ మేడిలు, మేశ్రం శేకు ఏ.యస్.పి అధ్యక్షుడు గేడం గోపీచంద్ ఏ .హెచ్ పీ జిల్లా అధ్యక్షుడు,సేడ్మాకి భగవంత్ రావ్, ఏ.వీ.ఎస్ పి జిల్లా అధ్యక్షుడు, మాడావి మధురజ్ ఏ. యస్.యు జిల్లా అధ్యక్షుడు, ఆత్రం కన్ను కొలం సంఘం అధ్యక్షులు, కుంరం షాంరావ్, మేశ్రం అంబాజీ రావ్, గేడం మారుతీ, సేడ్మాకి ప్రకాష్, కుంరం చందు ఆదివాసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**చిట్యాల,సెప్టెంబర్04 ( జనం సాక్షి):** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదల సంక్షేమం నిర్లక్ష్యానికి గురైందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని పనిచేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం చిట్యాల మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాలకు చెందిన 60 మంది లబ్ధిదారులకు రూ. 19,22,500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలు వైద్య ఖర్చులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ వారికి తగిన స్థాయిలో సహాయం అందలేదన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరులో ఆలస్యం, నిర్లక్ష్యం కారణంగా అనేక కుటుంబాలు అప్పుల పాలయ్యాయని విమర్శించారు.పేద ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ప్రచారానికే పరిమితమైన గత ప్రభుత్వం, ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ పథకాలను వేగవంతం చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి సహాయం అందేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా తక్షణ ఆర్థిక సాయం అందిస్తూ వారి భారం తగ్గిస్తున్నామని చెప్పారు.ఆరోగ్యశ్రీ పరిధిలో లేని అనేక వ్యాధులకు కూడా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని, ప్రజల ఆరోగ్య రక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో ఉన్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి వెనుకడుగు వేయడం లేదన్నారు.భూపాలపల్లి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.చెక్కులు అందుకున్న లబ్ధిదారులు తమకు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి గుమ్మడి శ్రీదేవి, వైస్ చైర్మన్ ఎండి రఫీ ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ వుడ్ పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**మహదేవపూర్ :సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** గ్రీన్ వుడ్ కాన్సెప్ట్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కన్నయ్య గోపికల వేషధారణలో అలంకరించారు. అలాగే చిన్నతనంలోనే కృష్ణుడు అల్లరి పిడుగుగా వెన్నదొంగగా ఉట్టికొట్టే విధానం చిలిపి చేష్టలతో జీవిత పరమార్థాన్ని తెలిపిన తీరును ప్రదర్శించారు. అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రులు వారి వివిధ వేషధారణ చూసి మురిసిపోతూ పాఠశాల యాజమాన్యం కృష్ణాష్టమి విశిష్టతను విద్యార్థులకు తెలియజేసే విధంగా చేసిన చొరువకు అభినందించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ చీరల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ. భిన్నత్వంలో ఏకత్వం గా నిలిపే సామాజిక ఉత్సవమని మన దేశ సాంస్కృతి సాంప్రదాయ ఆచార వ్యవహారాలు పండుగల విధానాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా ఉట్టికొట్టే భాగములో మానవ పిరమిడ్ తో విజయం సాధించిన పదవ తరగతి విద్యార్థులకు రూ. 1016 నగదు బహుమతిని పాఠశాల యజమాన్యం అందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చర్ల శ్రీనివాస్ రెడ్డి ప్రధానోపాధ్యాయులు సి. శ్రీనివాసరెడ్డి. డైరెక్టర్ ఆకుతోట రాజ్ కుమార్. ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# అక్రమ పట్టాలపై చర్యలు తీసుకోవాలి

- గోండ్వానా సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా అధ్యక్షుడు పూనేం ప్రతాప్
- అధికారులకి ఫిర్యాదు చేసిన చర్యలు శూన్యమే
- పట్టింపే లేని మండల రెవెన్యూ అధికారులు



**నూగూర్ వెంకటాపురం సెప్టెంబర్ 4(జనం సాక్షి ):-** వలస గిరిజనేతరుల అక్రమ పట్టాలు రద్దు చేయాలని,గొండ్వానా సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా అధ్యక్షుడు పూనేం ప్రతాప్ డిమాండ్ చేశారు. వెంకటాపురం మండల కేంద్రంలోని ఆర్,ఎం,బి గెస్ట్ హౌస్ ఆవరణలో గోండ్వానా సంక్షేమ పరిషత్ సంఘ సమావేశం ఏర్పాటుచేశారు .ఈ సమావేశంలో జిఎస్పీ జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ హాజరై మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరుల భూబదలాయింపులు నిరోధించే 1/70 చట్టం ప్రకారం ఏజెన్సీ భూములు గిరిజనేతర్ల పరం కాకూడదు అనే ఉద్దేశంతో అనాటి ప్రభుత్వాలు తెచ్చిన, ఎల్‌టిఆర్,1/70,పిసా చట్టాలను రెవిన్యూ అధికారులు ఖూనీ చేస్తున్నారని ఆరోపించారు. వెంకటాపురం మండలం మరికాల(జెడ్)లో అనేక భూ అక్రమాలు జరిగాయని, వాటికి నిదర్శనంగా సర్వేనెంబర్ 123,122,120, గల సర్వే నెంబర్లు గిరిజనేతరులకు వందల ఎకరాల అక్రమ పట్టాలు చేశారని పూనెం ప్రతాప్ అన్నారు.డిజిటల్ రికార్డులు తారుమారు చేస్తూ, భూభారతిలో డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్‌తో నిబంధనలకు విరుద్ధంగా గిరిజనేతరుల పేర్లను నమోదు చేస్తూ అధికారులే అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు.తప్పుడు పత్రాలతో 1/70 నిబంధనలు ఉల్లంఘించి భూమి హాక్కుపత్రాలు పొందారని,ఇది రెవెన్యూ అధికారులకి తెలిసిన ఎందుకు మౌనం వహిస్తున్నారని,ఇది చాలా సిగ్గుచేటని ఆయన ఎద్దేవా చేశారు.ఈ అక్రమ పట్టాల విషయమై మండల రెవెన్యూ అధికారికి ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన ఎలాంటి స్పందన లేదని ఆయన మండిపడ్డారు.త్వరలో ఈ విషయమై హైకోర్టు పిటిషన్ దాఖలా చేసి పట్టా మార్పిడి సవాల్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాటి రాజేష్, తాటి లక్ష్మయ్య, భీమయ్య, సిద్దు,చంటి, కొమరయ్య, రమేష్, చందు,తదితరులు పాల్గొన్నారు.

## ఈవిఎం గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు చర్యలు

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 4, జనం సాక్షి** ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్‌లో గల ఈవి ఎం గోదామును జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము వద్ద పోలీసు సిబ్బంది సమన్వయంతో పటిష్టమైన బందోబస్తు చేపట్టడంతో పాటు 24 గంటలు సి.సి. కెమెరాల ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. భద్రత సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలుపుతూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎస్‌ఎంఈలతో హరిత విప్లవం

### డీఐసీ జీఎం ఏ.సిద్ధార్థరెడ్డి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఎంఎస్‌ఎంఈలతో హరిత విప్లవానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని డీఐసీ జీఎం ఏ.సిద్ధార్థరెడ్డి తెలిపారు. ఎంఎస్‌ఎంఈలను పర్యావరణహిత, ఇంధన సామర్థ్య పరిశ్రమలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'గ్రీనింగ్ ఆఫ్ ఎంఎస్‌ఎంఈస్ ఇన్ తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ములుగులో ఆర్‌ఈసీపీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాలపల్లి, ములుగు జిల్లాలకు చెందిన ఎంఎస్‌ఎంఈల ప్రతినిధులు, రైస్‌మిల్లర్లకు పరిశ్రమల్లో విద్యుత్, ఇంధన వినియోగాన్ని తగ్గించడం, సోలార్ విద్యుత్ వినియోగం, నీటి సంరక్షణ, వ్యర్థాల తగ్గింపు, వనరుల సమర్ధ వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. వనరులను పొదుపుగా వినియోగించడం ద్వారా పరిశ్రమల నిర్వహణ వ్యయాలను తగ్గించుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడవచ్చని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఆర్‌ఈసీపీ అంచనా సేవలను ఎంఎస్‌ఎంఈలు సద్వినియోగం చేసుకోవాలని సిద్ధార్థరెడ్డి సూచించారు. పరిశ్రమల్లో వనరుల వినియోగాన్ని అంచనా వేసి,



పొదుపు మార్గాలను గుర్తించడం ద్వారా ఉత్పత్తి వ్యయాలను తగ్గించుకోవచ్చన్నారు. హరిత సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా ఎంఎస్‌ఎంఈలు మరింత పోటీతత్వాన్ని సాధించడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైస్‌మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌తో పాటు పలువురు ఎంఎస్‌ఎంఈల ప్రతినిధులు, రైస్‌మిల్లర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వెయ్యి రోజుల పాలన సంబరాలు



**ఖానాపూర్ సెప్టెంబర్ 04 (జనం సాక్షి)** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా 1000 రోజుల ప్రజా పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా, డిసిసి అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సమకూరి బాణాసంచా కాల్చి, ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ ఉత్సాహభరిత వాతావరణంలో విజయోత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి అన్ని వర్గాల సంక్షేమానికి, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే నిరంతరం శ్రమిస్తున్నాడని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ పార్టీని మరింత బలోపేతం చేస్తున్నాడని పేర్కొన్నారు. గత 1000 రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి ఫలాలను ప్రజల్లోకి క్షేత్రస్థాయిలో తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ చురుగ్గా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ దగా పాలనపై వంటావార్పుతో వినూత్న నిరసన



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 4 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నిరసనగా వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. 1000 రోజుల కాంగ్రెస్ పాలన ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైన దగా పాలనగా మారిందని విమర్శించారు. ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు, అనేక హామీలు ఇచ్చి ప్రజల ఓట్లు అడిగిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కో హామీని పక్కన పెడుతూ ప్రజలను మోసం చేస్తోంది. మాటలు చెప్పడం కాదు.. ఇచ్చిన హామీలను అమలు చేయాలి" అని దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు.ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ రాజీపడదని, ప్రజల హక్కులు, సంక్షేమం కోసం పోరాడుతూనే ఉంటామని దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు.ఈ వంటావార్పు కార్యక్రమంలో మాజీ కూడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి గారు, మాజీ కార్పొరేటర్లు, మాజీ డివిజన్ ప్రెసిడెంట్లు, మహిళా డివిజన్ ప్రెసిడెంట్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, వికలాంగులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## హైవే రోడ్డు పనులపై స్పందించకపోతే హైవే దిగ్బంధం చేస్తా

### బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**నెరడిగొండ సెప్టెంబర్4 (జనంసాక్షి):** మండలంలోని కుప్టి హైవే (ఎన్ హెచ్44)ను శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరిశీలించారు.కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశంలోనే పెద్ద ఉన్న రోడ్డుకు కుప్టి బ్రిడ్జి వద్ద గుంతలు పడటం వాటిని ఎన్ని రోజులైనా పట్టించుకోకపోవడం సరికాదని హైవే అధికారులపై ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మండిపడ్డారు. ప్రధాన జాతీయ రోడ్డుపై లక్షలాది వాహనాలు తిరిగే సందర్భంలో ఇలా బిడ్జిపై సింగిల్ వే చేయడం రోడ్డు ప్రమాదాలకు దారితీస్తుందని అన్నారు. ఇలా సింగిల్ వేతో అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ప్రజల ప్రాణాల కంటే తనకు ఏది ఎక్కువకాదని, రానున్న అసెంబ్లీలో సైతం దీని గురించి ప్రస్తావిస్తానన్నారు. సమాధానం రాకపోయినా, అధికారులు పనులు పూర్తి చేయకపోయినా హైవే దిగ్బంధం చేస్తానని హెచ్చరించారు.

### వంటావార్పుకు ముందు
## పదేళ్ల పాలనపై ఆత్మవిమర్శ చేయాలి

**బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దావేరా అనిల్ కుమార్ హితవు**



**దేవరుప్పుల, సెప్టెంబర్ 4 (జనం సాక్షి):** వంటావార్పులు, ధర్నాల పేరుతో ప్రజలను రెచ్చగొట్టడం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దావేరా అనిల్ కుమార్ అన్నారు. మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. వంటావార్పులతో గత పదేళ్ల వైఫల్యాలను ప్రజల జ్ఞాపకాల నుంచి చెరిపేయలేరని పేర్కొన్నారు.

### దొంగ హామీలతో గద్దెనెక్కిన రేవంత్..
## తెలంగాణను దోచుకుంటున్న బ్రోకర్ ఎర్రబెల్లి

**420 హామీల్లో ఒక్కటీ పూర్తిగా అమలు కాలేదు.. మహిళలు, రైతులు, పింఛన్‌దారులను మోసం చేసిన కాంగ్రెస్**






**దేవరుప్పుల, సెప్టెంబర్ 4 (జనం సాక్షి):** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. దేవరుప్పుల మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా వద్ద బీఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా మహాధర్నా, మహిళల వంట--వార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో పాటు ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటల గారడీతో ప్రజలను మభ్యపెడుతున్నారని, తెలంగాణను దోచుకుంటున్నారని ఆరోపించారు. "దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ఒక బ్రోకర్" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలతో అధికారంలోకి వచ్చిందని, అయితే వాటిలో ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, మూడు సంవత్సరాలుగా ఒక్కో మహిళకు రూ. లక్ష బకాయి ఉన్నట్లు పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో వృద్ధులకు రూ. 2 వేల పింఛన్ అందించామని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను నిర్లక్ష్యం చేసిందని ఎర్రబెల్లి ఆరోపించారు. మహిళలకు రూ. 2,500, కేసీఆర్ కిట్, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, వికలాంగుల పింఛన్లు, రైతుబంధు వంటి హామీలను అమలు చేయలేదని విమర్శించారు. రైతులకు సాగునీరు అందించడంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలు ప్రశ్నించాలని, కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అధికారం ఉన్నా లేకపోయినా ప్రజలకు, బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు తన అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ పల్లా భార్గవి, మాజీ ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేష్, మండల మహిళా నాయకురాళ్లు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామాల పార్టీ అధ్యక్షులు, యువజన నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ అవతారంలో వెంకటేశ్వర స్వామి

- లక్ష పుష్పాలతో స్వామికి అలంకరణ
- హాజరైన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు



**స్టేషన్ ఘన్ పూర్, సెప్టెంబర్ 04(జనంసాక్షి ):** శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో శ్రీకృష్ణ పెరుమాళ్ తిరునక్షత్ర మహోత్సవం సందర్భంగా శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామిని శ్రీకృష్ణ అవతా రంగా విశేషంగా అలంకరించడం జరిగింది. శుక్రవారం భక్తులందరికీ శ్రీకృష్ణ పరమాత్ముని దివ్యరూపంలో శ్రీవారు దర్శనమివ్వడం జరిగింది. భక్తులందరూ అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసి, శ్రీవారి దివ్య మంగళ దర్శనంచేసుకుని స్వామివారి మంగళాశాసన ములు పొందినారు. ఆలయ ఈవో బి లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్ర మంలో శ్రీకృష్ణపరమాత్ముని దివ్య కృపా కటా క్షాలు సర్వభగవద్ బంధువులపై ఎల్లప్పుడూ ఉండాలని లక్షపుష్పాలతో అర్చకులు అర్చన చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో దేవాలయం చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ధర్మకర్త మండలి సభ్యులు, ఆలయ ఈవో లక్ష్మీ ప్రసన్న, ప్రధాన అర్చ కులు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, అర్చకులు సౌమిత్రి శ్రీరంగాచార్యులు, కృష్ణమాచార్యులు ఆలయ సిబ్బంది, లక్ష పుష్పార్చన అలంకరణ దాతలు అలంకరణ తోట కిరణ్ - కీర్తి, గుండు అఖిల్ - చందన, అక్కినపల్లి యాకయ్య - రేణుక, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా పథకాలందించడంలో వెనకాడం

- ప్రతిపక్షాల అబద్ధపు మాటలు నమ్మొద్దు
- ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే జీఎస్సార్



**రేగొండ, సెప్టెంబర్ 04( జనం సాక్షి):** ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జయశంకర్ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం ఉమ్మడి మండలంలో 34 మంది లబ్ధిదారులకు రూ. 11,92,000 విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. అనారోగ్య సమస్యలతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ సహాయం అందిస్తూ వారి భారం తగ్గిస్తోందని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకంలో కవర్ కాని అనేక సంస్థలు వ్యాధులకు కూడా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సంక్షేమ కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగిస్తామని ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దన్నారు. పేదల వైద్య ఖర్చులు భారంగా మారకుండా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వేలాది కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గంలో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, ప్రజలకు అవసరమైన సహాయం అందించడంలో ఎల్లప్పుడూ ముందుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో బాలిక మృతి



**నల్లబెల్లి, సెప్టెంబరు 04(జనంసాక్షి):** పండగ పూట ఓ కుటుంబంలో విషాదం నెలకొంది. విద్యుత్ మోటార్ స్విచ్ ఆన్ చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై 14 ఏళ్ల బాలిక మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. ఎస్సై సాయి ప్రసన్నకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పిట్టల రమేష్ కుమార్తె సిరివెన్నెల (14) నల్లబెల్లి ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. శు క్రవారం కృష్ణాష్టమి సందర్భంగా పాఠశాలకు సెలవు కావడంతో ఇంటి వద్దే ఉంది. నీటి కోసం కరెంటు మోటార్ స్విచ్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు పేలిపోయి ఉన్న విద్యుత్ వైరు ఆమె చేతికి తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనంలో నర్సంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలిక తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తె మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సిరివెన్నెల మృతితో మండల కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## శ్రీకృష్ణాష్టమి వేడుకలకు భారీగా తరలిన దేవరుప్పుల యాదవులు



**దేవరుప్పుల సెప్టెంబర్ 04 (జనం సాక్షి)** జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలకు దేవరుప్పుల మండల కేంద్రం నుంచి యాదవ కులస్తులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. శ్రీకృష్ణుడి జయంతి సందర్భంగా నిర్వహించే వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు, కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో పెద్ద ఎత్తున దాదాపు 200 యాదవులు జనగామకు బయలుదేరారు. ఈ సందర్భంగా "జై శ్రీకృష్ణ" నినాదాలతో మండల కేంద్రంలో సందడి నెలకొంది. సంప్రదాయాలను కాపాడుతూ, ఐక్యతను చాటుతూ శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని యాదవ సంఘం నాయకులు తెలిపారు. శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# బిఆర్ఎస్ ఆధ్వర్యంలో వంట వార్పు నిరసన కార్యక్రమం



బయ్యారం సెప్టెంబర్ 4((జనంసాక్షి) కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనలో ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బిఆర్ఎస్ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ పిలుపు మేరకు చేపట్టిన వారం రోజుల సమరభేరి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో వంటా వార్పు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్,మాజీ జెడ్పీ చైర్ పర్సన్ కుమారీ ఆంగోత్ బిందు మాట్లాడుతూ గత శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం ఆరు గ్యారెంటీలను, 420 హామీలను ఇచ్చి అధికారం చేజిక్కించుకుందని అన్నారు. అధికారం చేపట్టి రెండున్నర సంవత్సరాలు కాలమైనా ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలు చేయలేదని ఆరోపించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా కేసీఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతుబంధు, రైతు బీమా,లాంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేయకుండా నిలిపి వేసిందని విమర్శించారు. అధికారం చేపట్టిన 100 రోజుల్లోనే హామీలను అమలుచేస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు నరకాన్ని చవి చూపిస్తున్నాడని అన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను బిఆర్ఎస్ పార్టీ ప్రజల్లోకి తీసుక పోవడంలో భాగంగా అనేక కార్యక్రమాలు చేపడుతుందని నాయకులు పేర్కొన్నారు. ఇటీవల బయ్యారం పెద్ద చెరువు నిండినప్పటికీ నీటిని విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ స్థానిక తాసిల్దార్ కార్యాలయం ముందు వెంటనే నీటిని విడుదల చేయాలని ధర్నా చేపట్టిన విషయాన్ని ఈ సందర్భంగా నాయకులు గుర్తు చేశారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకుపోతూ తిరిగి కెసిఆర్ ని ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అహర్నిశలు శ్రమించాలని వారు పిలుపు నిచ్చారు. మండల పార్టీ అధ్యక్షులు తాతా గణేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి భారీ సంఖ్యలో మండలంలోని మహిళా కార్యకర్తలు తరలి వచ్చారుఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు దిండిగల రాజేందర్, మాజీ ఇల్లందు వ్యవసాయ కమిటీ చైర్మన్ హరి సింగ్ నాయక్, జిల్లా నాయకులు శ్రీకాంత్ నాయక్,గంగుల సత్యనారాయణ, ఏనుగుల బలయ్య, మండల పార్టీ ఉపాధ్యక్షులు మురళి, రేపా కుల వెంకన్న, లక్ష్మణ్ నాయక్, కల్పన సునీల్ నాయక్, బి ఆర్ ఎస్ సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల కర్కశ దగా పాలన

## బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు



బెల్లంపల్లి, సెప్టెంబర్ 4, (జనంసాక్షి) కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన కర్కశ, దగా పాలన అని బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఆరోపించారు. శుక్రవారం ఆయన కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల దగా పాలన, 6 గ్యారెంటీలు, 420 హామీల మోసాలపై బిఆర్ఎస్ పోరుబాట కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అధ్యక్షతన బెల్లంపల్లి మున్సిపాలిటీ 13వ వార్డులో నియోజకవర్గ వృద్ధులు, వికలాంగులు, మహిళలతో సదస్సు, మహిళలకు 2500 రూపాయలు, కెసిఆర్ కిట్, కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, 500 రూపాయలకే వంట గ్యాస్, విద్యార్థినిలకు స్కూటీలు ఇవ్వని ప్రభుత్వానికి నిరసనగా వంటా వార్పు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల కర్కశ, దగా పాలనలో రాష్ట్రంలోని ప్రతీ మహిళకు, విద్యార్థినికు 33 నెలల్లో బాకీ పడిన నెలకు 2500 రూపాయల చొప్పున 82,500 రూపాయలు, చేయూత పెన్షన్ రూపంలో వృద్ధులు, ఒంటరి మహిళలు, వికలాంగులకు బాకీ పడిన 66,000 రూపాయలు, కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్ పథకంలో భాగంగా తులం బంగారం, విద్యార్థినిలకు బాకీ పడిన స్కూటీ, తదితర బాకీలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర మహిళలు, వృద్ధులు, వికలాంగుల తరుపున బిఆర్ఎస్ పార్టీ పక్షాన పోరాటం ఉధృతం చేసి అన్నీ బాకీలు చెల్లించేవరకూ విశ్రమించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, నియోజకవర్గ మహిళలు, వృద్ధులు, వికలాంగులు, బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.

# కుబీర్‌లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ 1000 రోజుల పాలన సంబరాలు



కుబీర్, సెప్టెంబర్ 4, (జనంసాక్షి): కుబీర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలన విజయవంతంగా 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయంపై ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. ప్రజా రంజక పాలన అందిస్తూ ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలను చేరవేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి సమక్షంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన సుమారు 10 మంది ముఖ్య నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై మండలంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. పార్టీ మారిన నాయకులకు మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులయ్యే తాము పార్టీ మారుతున్నట్లు ఈ సందర్భంగా చేరిన నాయకులు ప్రకటించారు. సమావేశం అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలు చేస్తూ పట్టణ పురవీధుల్లో సాగిన ఈ ర్యాలీలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విట్టాపూర్ మహిపాల్ రెడ్డి, మండల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ జెడ్పిటిసిలు నాయకులు తదితరులు ఉన్నారు.

# ఎమ్మెల్యే రేవూరికి విగ్రహ ప్రతిష్టాపన ఆహ్వాన పత్రిక అందజేత



హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 4 (జనం సాక్షి) : నడికుడ మండలం కంఠాత్మకూర్ గ్రామంలో గ్రామస్తుల సహకారంతో పోచమ్మ తల్లి ఆలయ నూతన నిర్మాణం చేపట్టిన సందర్భంగా ఈ నెల 6, 7, 9 తేదీల్లో జరిగే ప్రత్యేక పూజా కార్యక్రమాలు, విగ్రహ ప్రతిష్టాపన మరియు బోనాల పండుగకు రావాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని హనుమకొండ వారి స్వగృహం నందు మర్యాదపూర్వకంగా సర్పంచ్ కొంగంటి తిరుపతి ఆలయ కమిటీ సభ్యులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేసి ఆహ్వానించారు.అనంతరం పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డిని కూడా ఆహ్వానించడం జరిగింది..ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పర్నెం మల్లారెడ్డి,గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు భైరపాక భద్రయ్య, మాజీ సర్పంచ్ రేకుల సతీష్, కమిటీ సభ్యులు చింతిరెడ్డి రాజిరెడ్డి, ఊట్ల మల్లారెడ్డి, సామజీ సురేష్, మాదాసు శ్రీనివాస్, ఆకుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# శిశు మందిర్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు



మహబూబాబాద్, సెప్టెంబర్ 04(జనం సాక్షి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శిశు మందిర్ పాఠశాలలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను పాఠశాల ప్రిన్సిపాల్ నామ సౌందర్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కార్యదర్శి గోపాల్ గిలడా మాట్లాడుతూ సమస్త మానవాలికి ధర్మ మార్గాన్ని బోధించిన శ్రీ కృష్ణ పరమాత్ముడు అవతరించిన పవిత్ర పార్వదినం శ్రీ కృష్ణ జన్మాష్టమని, పాఠశాల తరుపున ప్రజలకు విద్యార్థులకు, తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు, పాఠశాలలో విద్యార్థులు శ్రీ కృష్ణ మరియు గోపికల వేశాధారణలో విచ్చేసి ఉట్టి కొట్టడం, నృత్యాలు చేయడం జరిగిందని అన్నారు,పిల్లలకు మన సాంస్కృతి సాంప్రదాయాలు తెలిసే విధంగా పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు, ప్రతి ఒక్కరు భగవద్గీత పారాయణం చేయాలనీ అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన వేశాధారణలు అందరిని ఆకట్టుకున్నాయి . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సౌందర్య, వేంకటేశ్, ఉపాధ్యాయులు నిరోషా, సాధన, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఇంటి పెరట్లో గంజాయి సాగు



కుబీర్, సెప్టెంబర్ 04, (జనంసాక్షి): నిర్మల్ జిల్లా కుబీర్ మండలం గోడాపూర్ గ్రామంలో ఇంటి పెరట్లో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి మొక్కలు పెంచుతున్న ఒక వ్యక్తిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. గోడాపూర్ గ్రామానికి చెందిన షేక్ నసీర్ అనే వ్యక్తి తన ఇంటి చుట్టుపక్కల, పెరట్లో నిషేధిత గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు కుబీర్ పోలీసులకు నమ్మదగిన సమాచారం అందింది. ఈ సమాచారంతో భైంసా రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ డాగ్ స్క్వాడ్‌తో కలిసి, ఎస్సై కృష్ణారెడ్డి పోలీస్ బృందంతో నసీర్ నివాసంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సోదాల్లో నసీర్ తన ఇంటి వెనుక భాగంలో రహస్యంగా పెంచుతున్న రెండు భారీ గంజాయి మొక్కలను పోలీసులు కనుగొన్నారు. ఆ మొక్కలను వెంటనే స్వాధీనం చేసుకున్న పోలీసులు, నిందితుడు నసీర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్సై కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మండల పరిధిలో గంజాయి, ఇతర ఎలాంటి మత్తు పదార్థాల విక్రయాలు లేదా సాగు చేసినా సహించేది లేదని, వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల పరిధిలో ఎవరైనా ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు.

# ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



**కాళేశ్వరం , సెప్టెంబర్ 04 , ( జనం సాక్షి).** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవాలయ అనుబంధ ఆలయమైన శ్రీ రామాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం సాయంత్రం ఆరున్నర గంటల నుండి భగవన్నామ సంకీర్తన జరగగా 7.30 కు భాగవత అంతర్గత శ్రీకృష్ణ జననం , మంత్రపుష్పం ,తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమంలో అర్చకులు , ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. శనివారం ఉదయం గ్రామంలో శ్రీకృష్ణుని ఉత్సవమూర్తులతో ఊరేగింపు, గోపాల కాలువలు అనంతరం ఉట్టి కొట్టు కార్యక్రమం జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

# మెడిసిన్‌లో సీటు సంపాదించిన సమిత్

**చెన్నారావుపేట, సెప్టెంబర్ 4( జనం సాక్షి ):** మండలంలోని నంబర్ వన్ కాలనీకి చెందిన బోల్లెపల్లి సమిత్ మెడిసిన్‌లో సీటు సంపాదించాడు. మండలంలోని నంబర్ వన్ కాలనీకి చెందిన బోల్లెపల్లి సరిత- మహేందర్ దంపతుల కుమారుడు సమీత్ పదవ తరగతి వరకు మండల కేంద్రంలోని సిద్ధార్థ గురుకుల విద్యాలయంలో చదివాడు. ఇటీవల విడుదలైన నీట్ ఫలితాలలో హైదరాబాద్‌లోని సనత్ నగర్ ఇఎస్ఐ మెడికల్ కళాశాలలో మెడిసిన్ సీటు సంపాదించాడు. సమీత్‌కు మెడిసిన్ సీటు రావడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.




# లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**మంగపేట, సెప్టెంబర్ 04 (జనంసాక్షి)** ఆపద సమయంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్యతో కలిసి 32 మంది లబ్ధిదారులకు రూ. 14,82,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతోనే మంగపేట మండలానికి ఈ ఆర్థిక సహాయం మంజూరైందని తెలిపారు. ములుగు జిల్లా ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి, వైద్య చికిత్సల కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా భరోసానిస్తున్న మంత్రి సీతక్క సేవలు అభినందనీయమన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చింతా పున్నారావు, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, మాజీ సర్పంచ్ పగిడిపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ పూజారి సురేందర్, పచ్చ శేషగిరిరావు, బండ జగన్ మోహన్ రెడ్డి, చాద మల్లయ్య, వీరస్వామి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# పుస్తె మట్టెలు అందించిన వాస్విక్ ఫౌండేషన్



**బచ్చన్నపేట సెప్టెంబర్ 4 ( జనం సాక్షి):** బచ్చన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన చిలుక ఎల్లయ్య- అనిత దంపతుల కుమార్తె శ్రీ వాణి వివాహానికి వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తె మట్టెలను వివాహ కానుకగా అందజేశారు.ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్ కుమార్, వైస్ చైర్మన్ నూకల భాస్కర్ రెడ్డి సూచనలు, సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.వాస్విక్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాజీ సర్పంచ్ నూకల నవ్య నర్సింహారెడ్డి, గ్రామ సర్పంచ్ నూకల కల్పన రాజిరెడ్డి, ఉపసర్పంచ్ పిడుగు మహేష్ చేతుల మీదుగా పెళ్లికూతురు ఇంటికి వెళ్లి, కుటుంబ సభ్యుల సమక్షంలో పుస్తె మట్టెలను కానుకగా అందజేశారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు వాస్విక్ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పేద కుటుంబాల్లో జరిగే వివాహాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ, ఆడబిడ్డలకు అండగా నిలవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శివరాత్రి బాలరాజు, ఇమ్మడి రవీందర్, పిడుగు కనకయ్య, పిడుగు పెద్ద కనకయ్య తదితరులు పాల్గొన్నారు

# హనీ ట్రాప్ చేసి రూ.14.75 లక్షలు మోసం చేసిన నిందితుడి అరెస్ట్

**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 04 ( జనం సాక్షి)** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీ సి ఎస్ ) డైరెక్టర్ శిఖా గోయల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, వరంగల్ పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్, వరంగల్ పోలీసులు హనీ ట్రాప్ సైబర్ మోసానికి పాల్పడిన నిందితుడిని తమిళనాడు రాష్ట్రంలోని సేలం జిల్లాలో అరెస్ట్ చేశారు. సైబర్ క్రైమ్ ఎస్హెచ్ఓ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్, వరంగల్‌లో నమోదైన క్రైమ్ నెంబర్.21/2026 కేసులో వరంగల్‌కు చెందిన తుమ్మ ఉదయ్ కిరణ్ (32), సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో నిందితుడు వై99 వెబ్‌సైట్ ద్వారా 'లావణ్య' అనే మహిళగా నటిస్తూ బాధితుడితో పరిచయం ఏర్పరచుకున్నట్లు గుర్తించారు. అనంతరం బాధితుడితో సన్నిహితంగా మెలుగుతూ అతని నమ్మకాన్ని పొందాడు.తరువాత అత్యవసర అవసరాలు, విద్య మరియు పరిశోధన ఖర్చులు, వైద్య అవసరాలు, వ్యక్తిగత అవసరాలు తదితర కారణాలను చూపుతూ బాధితుడిపై భావోద్వేగపూరిత ఒత్తిడి తీసుకువచ్చి పలుమార్లు డబ్బులు బదిలీ చేయించుకున్నాడు.వివిధ బ్యాంకు ఖాతాలు మరియు యూపీఐ లావాదేవీల ద్వారా బాధితుడి నుంచి మొత్తం రూ.14,75,100/- మోసం చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.సాంకేతిక మరియు ఆర్థిక ఆధారాల ఆధారంగా నిందితుడిని గుర్తించిన సైబర్ క్రైమ్ పోలీసుల ప్రత్యేక బృందం తమిళనాడు రాష్ట్రంలోని సేలం జిల్లాలో నిందితుడిని అరెస్ట్ చేసి, కోర్టు ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించింది. ఈ కేసులో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బి. శివకృష్ణ, దినేష్, భరత్ మరియు జహూర్ మొహమ్మద్ ప్రత్యేక దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు. పోలీసుల సూచనలు:ఆన్‌లైన్‌లో పరిచయమయ్యే వ్యక్తులను పూర్తిగా నమ్మి వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు లేదా ఆర్థిక సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు.ముఖ్యంగా సోషల్ మీడియా, డేటింగ్ మరియు చాటింగ్ యాప్‌ల ద్వారా పరిచయమయ్యే వ్యక్తులు డబ్బులు అడిగినప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.ఎవరైనా సైబర్ మోసానికి గురైనట్లయితే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్కు కాల్ చేయాలని పోలీసులు కోరారు.

# కనిపించని పౌర హక్కుల దినోత్సవం..

- ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చెయ్యాలన్న మండల అధికారుల చొరవ శూన్యం
- యువతలో చట్టాలపై అవగాహన కోసమే పౌర హక్కుల దినోత్సవం

**ఎల్క్ తుర్తి. సెప్టెంబర్ 4 జనం సాక్షి** తెలంగాణ రాష్ట్రంలో 2018 ఏప్రిల్ 10 నుండి మొదలు కాగా గ్రామాల్లో ప్రతి నెల చివరి రోజున మాదిగ కాలనీలో లేదా రచ్చబండ దగ్గర కుల వివక్షత, అస్పృశ్యతను రూపుమాపేందుకు పౌర హక్కులపై యువతలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయుటకు హక్కులపై అవగాహన కల్పించడానికి గ్రామాలలో "పౌర హక్కుల దినోత్సవం" ఏర్పాటు చేసుకోవడం జరుగుతుంది దీనికి పోలీస్ అధికారులు తహసిల్దార్ ,సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. పౌర హక్కుల దినోత్సవం నేపథ్యంలో గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలపై జరిగే అక్రమాలు ధౌర్జన్యల ను అరికట్టడానికి, సమానత్వాన్ని చాటేందుకు ప్రభుత్వ అధికారులు, పోలీసుల ఆధ్వర్యంలో ఈ దినోత్సవం జరుపుతారు.డా బి ఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో రాసిన హక్కులు, చట్టాల గురించి ప్రజలకు వివరించడం ద్వారా దీని ప్రధాన ఉద్దేశం అని చెప్పవచ్చు భారత దేశాన్ని సామాజిక కుల వివక్ష లేని సమాజ నిర్మాణం కోసం అందరూ కలిసికట్టుగా ఉండాలని కోరతారు "పౌర హక్కుల దినోత్సవం పౌర స్వేచ్ఛ .మానవా వెట్టిచాకిరీ రాజ్యంగంలో నిషేధితం . ఏటా డిసెంబర్ 10న ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం జరుపుకుంటారు. ఏ విధమైన వివక్ష లేకుండా సంవత్సరములో అడిగిన సందర్భాన్ని బట్టి "పౌర హక్కుల దినోత్సవం" తెలంగాణలో పౌర హక్కుల దినోత్సవన్నీ తెలంగాణలో గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో కులవివక్ష, అస్పృశ్యత నివారించేందుకు ప్రతి నెల నిర్వహించేశీదు కు ప్రభుత్వం ఏర్పాటు చేసిశీది ఎస్సీ, ఎస్టీ కమిషన్ దీనిని ప్రతి నెల ఒక ప్రత్యేక రోజూ నిర్వహించాలని నిర్ణయించింది. లిపట్టింపు చెయ్యని. సంబంధిత అధికారులులి సివిల్ రైట్ డే రోజు సాంప్రదాయ బంధంగా ఏర్పాటు చెయ్యాలన్న ఉండే శముతో సంబంధిత అధికారులు తహసిల్దార్ ఎస్సై లు. గ్రామల్లో నెల రోజుల్లో చివరి రోజున గ్రామాల్లో సివిల్ డేను ఏర్పాటు చెయ్యాల్సింది పోయే నేడు మరిచిన మాట వాస్తవము అన్నట్లు గ్రామస్తులు తెలిపారు రోజు రోజుకు తగ్గుచున్న హక్కుల దినోత్సవం టీడీపీ, వై ఎస్ ప్రభుత్వంలో ప్రతి నెల చివరి రోజున గ్రామాల్లో సివిల్ రైట్ "డే" సాంప్రదాయ పద్ధతిలో జరుపుకుని యువతకు ఉపాధి,హక్కులు, అట్రాసిటీ ,లాంటివి పోలీస్ అధికారులు లేదా తహసిల్దార్ కార్యాలయసిబ్బంది ప్రజలకు యువతకు అవగాహన చెప్పే వారు కానీ రాను రాను అలాంటివి అవగాహన లేక యువత పక్కా దారి పట్టి మద్యం గంజాయి, పాన్ మసాలా గుటక,తంబక్కు లాంటి చెడు వ్యసనాలకు బానిసలు అయి కుటుంబాలు చిన్న భిన్నమయ్యే ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి అట్రాసిటీ పై అవగాహన కలిగివుండాలి.

# ముధోల్ మండల కాంగ్రెస్ కమిటీ నూతన కార్యవర్గం నియామకం

### మండల అధ్యక్షుడు కిష్టయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం



**ముధోల్, సెప్టెంబర్ 03( జనం సాక్షి)** జిల్లా కాంగ్రెస్ కమిటీ – నిర్మల్ ఆదేశాల మేరకు, "సంగఠన్ సృజన్ అభియాన్"లో భాగంగా ముధోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాపేవార్ కిష్టయ్య ఆమోదంతో నూతన మండల కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.ఈ నూతన కమిటీ సభ్యులకు మండల అధ్యక్షులు కిష్టయ్య ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముధోల్ సర్పంచ్ పార్టీ సభ్యులను శాలువతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కమిటీ సభ్యులందరూ ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని సంబరాలు జరుపుకున్నారు. నూతనంగా నియమితులైన ముధోల్ మండల కాంగ్రెస్ కమిటీ సభ్యుల వివరాలు వైస్ ప్రెసిడెంట్లుగా మాలిక్ ఇద్రిజ్ ఖాన్,కె. వంశీ కృష్ణ ,మహ్మద్ అబ్దుల్ అజీజ్ లు ,జనరల్ సెక్రటరీలుగా రాజేందర్ రెడ్డి, ఎ. శ్రీనివాస్ గౌడ్, టి. గోవింద్ రావు పటేల్,వి. విజయభారతి, నగరం మహిరాజ్,జై భీమ్,సెక్రటరీలుగా రంగారావు, ఎం. సైనాథ్,నల్లోల్ల పోతారెడ్డి, బాద్రే మహేందర్,ఎస్.కె. పాషా,ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పి. విఠల్,టి. భోజేందర్,పవర్ శ్యామ్ రావు,అక్తర్ బీ,సరోజ, మురళి,పి. సురేష్ లను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు మాజీ పిఎసిఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, తరోడ సర్పంచ్ ఆరిఫ్, విట్టోలి సర్పంచ్ దీపక్, కార్యకర్తలు పాల్గొన్నారు.